
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శనివారం 17 ఆగస్టు 2024 | 3



జిల్లాకు ఇద్దరు అడిషనల్ ఎస్పీలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 49 మంది అడిషనల్ ఎస్పీలకు స్థానచలనం కలిగిస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.జిల్లా శాంతి భద్రతల విభాగం అడిషనల్ ఎస్పీగా ఏవీ సుబ్బరాజు, పరిపాలనా విభాగం అడిషనల్ ఎస్పీగా సీఐడీలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రాజశేఖర్ రావు నియమితులయ్యారు. సుబ్బరాజు చిత్తూరు జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తూ ఇక్కడికి వస్తున్నారు.ఇక్కడ పరిపాలనా విభాగం అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న ఎస్ఆర్ రాజశేఖర్ రాజు అన్నమయ్య జిల్లాలో అదే విభాగానికి వెళ్లారు.



కొవ్వూరు అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు

నిడదవోలులో ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరంలో ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల

రోజుకు రూ.15

అన్న క్యాంటీన్లు పునః ప్రారంభం



కూటమి ప్రభుత్వం వచ్చింది.. పేదల ఆకలి తీర్చుతోంది. నిన్నటి వరకూ ఆకలి వేస్తే అన్నమో రామచంద్రా అంటూ అర్రులు చాచాల్సిందే..మరి నేడు ఆ బాధేం లేదు.. కేవలం రూ.15 పెడితే చాలు ఉదయం టిఫిన్..మధ్యాహ్నం, రాత్రి భోజనం.. ఎందుకంటే మళ్లీ అన్న క్యాంటీన్లు పునఃప్రారంభమయ్యాయి. రాజమహేంద్రవరంలో మూడు, కొవ్వూరు, నిడదవోలులో ఒక్కొక్కటి చొప్పున శుక్రవారం ఈ అన్న క్యాంటీన్లు ప్రారంభించారు.. పేదల కడుపు నింపడానికి మళ్లీ చంద్రన్న క్యాంటీన్లు వచ్చేశాయి..

- జిల్లాలో ఐదు ఏర్పాటు
- రాజమహేంద్రవరంలో మూడు
- కొవ్వూరు, నిడదవోలులో ఒక్కొక్కటి
- పట్టణాల్లోని రద్దీ ప్రదేశాల్లో ఆరంభం
- మూడు పూటలా ఆహారం కేవలం రూ.15
- ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

నిడదవోలు, ఆగస్టు 16 : రాష్ట్రంలో పేద ప్రజల ఆకలి తీర్చేందుకు పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతోనే రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్‌లో శుక్రవారం అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించి వృద్ధులకు ఆహారాన్ని అందించారు. 2014-19 మధ్య అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించి రూ.ఐదుకే అల్పాహారం, రూ.ఐదుకే భోజనం అందించారన్నారు. గత ప్రభుత్వం దీనిని నిర్వీర్యం చేసి పేదల కడుపుకొట్టిందన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగానే నేడు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించడం జరిగిందన్నారు. అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మ పేరును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపాదన మేరకు సీఎం చంద్రబాబు మధ్యాహ్న భోజన పథకానికి పెట్టడం జరిగిందన్నారు.అన్న క్యాంటీన్‌కు దాతలు తమ విరాళాలను అందించి తమ వంతు సహకారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ రామ్ భూపాల్‌రెడ్డి, జనసేన నాయకులు రంగా రమేష్, బీజేపీ నాయకులు బండి సత్యనారాయణ, నీలం రామారావు, బలిజేపల్లి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూడు పూటలా కడుపు నింపుతాం : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్, ఆగస్టు 16 : రోజుకు రూ.15లు పెడితే మూడు పూటలా కడుపు నింపుతారని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో మూడు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. తొలుత క్వారీ సెంటర్ వద్ద ప్రారంభించారు. తరువాత రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి), సుబ్రహ్మణ్య మైదానం వద్ద గల అన్న క్యాంటీన్లను ప్రారంభించారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూఅన్న క్యాంటిన్లు పేదలు వినియోగించుకోవాలన్నారు. రోజుకు రూ.15 పెడితే మూడు పూటలా కడుపు నిండుతుందన్నారు. ముం దుగా టోకెన్లు ఇచ్చి దాని ప్రకారం ఆహారం అందిస్తారని చెప్పారు. రాజమహేం ద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ అన్న క్యాంటీన్లు మూసివేసి పేదల కడుపుకొడితే చంద్రబాబు ఆకలిబాధలు తీర్చారన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ పేదవాడు ఆకలితో ఉండకూడదన్నదే కూటమి ధ్యేయమన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన భోజనాన్ని ప్రతిరోజు అందించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం అల్పాహారం వడ్డించారు. వాటిని పేదలతో కలిసి తిని వాటి నాణ్యతను పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, తెలుగుదేశం నాయకులు కాశి నవీన్‌కుమార్, రవి యాదవ్, కూటమి నాయకులు అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించి పేదలతో కలిసి ఆహారం తీసుకున్నారు.

రూ.5లకే కడుపు నిండుగా : ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 16 : రాష్ట్రంలో ప్రతి పేదవాడికి కూడు, గూడు, గుడ్డ అందించాలన్నదే టీడీపీ లక్ష్యమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అన్నా క్యాంటీన్‌కు వచ్చిన వారికి ఆహార పదార్థాలను ఎమ్మెల్యే, ఇతర నాయకులు వడ్డించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ సిద్ధాంతాలతో 2014-19 మధ్య చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చుచేసి విలాస మందిరాలు నిర్మించుకున్నాడన్నారు. ఐదేళ్లపాటు అన్నా క్యాంటీన్లను మూసివేసి పేద ప్రజల కడుపు కొట్టాడన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో మరలా అన్నా క్యాంటీన్లు ప్రారంభించి రూ.5లకే భోజనం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావు, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, పాలెంపాటి చినబాబు, యనమదల సుబ్రహ్మణ్యం, బేతిన నారాయణ, కలగర సుబ్బారావు, పిల్లలమర్రి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో టిఫిన్ ప్లేట్లు అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

మా కోసమే చంద్రబాబు తెరిచారు..



పువ్వులు అమ్ముకునేందుకు రాజమహేంద్రవరం వచ్చి గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో భోజనం చేసేవాడిని.. అన్న క్యాంటీన్ మూసివేశాక టిఫిన్ చేసినా.. భోజనం చేసినా జేబు ఖాళీ అయ్యేది. మాలాంటి పేదలకోసమే చంద్రబాబు అన్న క్యాంటీన్లు తెరిచారు. ధన్యవాదాలు చంద్రబాబు గారు. - వెంకటకృష్ణ, శ్రీరాంపురం

పట్టెడన్నం పెడుతున్న చంద్రన్న..



గతంలో చంద్రబాబు దయ వల్ల రూ.5కే అన్నం తినేవాళ్లం.. కానీ ఎప్పుడైతే ప్రభుత్వం మారిందో అన్న క్యాంటీన్లు తెరుచుకోలేదు. అప్పటి నుంచి చాలా ఇబ్బందులు పడ్డాం.మళ్లీ అన్న క్యాంటీన్లు తెరుచుకునే రోజు కోసం ఎదురుచూశాం.. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది..మా ఆశ తీరింది.

- చిన్నబాబు, రాజమహేంద్రవరం

ఆకలి బాధలు తీరతాయి..



గత ఐదేళ్లలో చాలా ఇబ్బందులు పడ్డాం. పనులకు వెళ్లినప్పుడు మధ్యాహ్నం రూ.5 ఉంటే అన్న క్యాంటీన్‌లో భోజనం చేసేవాళ్లం. అయితే గత వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసివేశాక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇన్నేళ్లకు కష్టాలు తీరాయి. మళ్లీ రూ.5కే టిఫిన్, భోజనం పెట్టడం ఆనందం.

- కురుపల్లి నాగేశ్వరరావు, జాంపేట



భూపతి | మునిసిపల్ కార్యాలయం | కామిశెట్టి

నిడదవోలులో కుర్చీలాట!

- 2021లోనే మునిసిపల్ ఛైర్మన్‌పై ఒప్పందం
- పదవీకాలం పంచుకునేలా నిర్ణయం
- కుదరదంటున్న భూపతి.. తేల్చాలంటున్న కామిశెట్టి
- మాజీ ఎమ్మెల్యే జీఎస్ నాయుడు మాట వినని వైనం

నిడదవోలు, ఆగస్టు 16 : నిడదవోలు వైసీపీలో కుర్చీ కుమ్ములాట మునిసిపల్ కార్యాలయం వేదికగా రచ్చకెక్కింది. ఛైర్మన్ కుర్చీ నాదంటే.. నాదంటూ ఇద్దరు పోటీపడుతున్నారు. నిడదవోలు పురపాలక సంఘానికి 2021లో జరిగిన ఎన్నికల్లో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు ఛైర్మన్ పదవికి పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఇరువురి మధ్య ఒక ఒప్పందం చేశారు.25వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భూపతి ఆదినారాయణ (ఆదిబాబు)కు రెండున్నరేళ్లు.. ఆ తరువాత రెండున్నరేళ్లు 21వ వార్డు నుంచి విజయం సాధించిన వైసీపీ కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ (సత్తిబాబు)కు అవకాశం ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. ఆ ఒప్పందం మేరకు ఇటీవల ఆ గడువు ముగిసింది. దీంతో కామిశెట్టి వెంకట సత్యనారాయణ ముందుగా చేసుకున్న ఒప్పందాన్ని గుర్తుచేశారు. అయితే దానికి భూపతి ఆదినారాయణ ససేమిరా అనడంతో వివాదం కాస్తా రచ్చకెక్కింది. ఎన్నికల కోడ్ తదితర కారణాలతో ఛైర్మన్ పదవి మార్పు మారుతూ వచ్చింది. ఇదిలా ఉండగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. వైకాపా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఓటమి పాలయ్యారు. ఇటీవల ఆగస్టు ఒకటో తేదీన ఛైర్మన్ భూపతి ఆదినారాయణ జన్మదిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హాజరయ్యారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం భూపతి ఆదినారాయణను ఛైర్మన్ పదవికి రాజీనామా చేయమని కోరారు.అయితే సార్వత్రిక ఎన్నికల్లో సర్దుబాటు చేసిన భారీమొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తే రాజీనామా చేస్తానంటూ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ చెప్పినట్టు సమాచారం. మరో పక్క ఒప్పందం ప్రకారం ఛైర్మన్ కుర్చీ తనకు ఇవ్వాలంటూ కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడిపై ఒత్తిడి తెచ్చారు. కుర్చీ ఆటలో ఇద్దరు బాబుల మధ్య మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఇరుక్కుపోయి ఎటూ తేల్చు కోలేని పరిస్థితి నెలకొంది.నిడదవోలు పురపాలక సంఘ కార్యాలయ ఛైర్మన్ చాంబర్‌లో శుక్రవారం మధ్యాహ్నం మరోసారి విభేదాలు రచ్చకెక్కాయి. కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ మరికొంత మంది కౌన్సిలర్లతో కలసి భూపతి ఆదినారాయణ ఛాంబర్‌కు వచ్చి ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఛైర్మన్ భూపతి ఆదినారాయణ తనకు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఇవ్వవలసిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తే రాజీనామా చేస్తానని లేదంటే చేసే ప్రసక్తే లేదంటూ లేచి వెళ్లిపోయారు. దీంతో వైసీపీలోనే ఒక కౌన్సిలర్‌కు మరో మహిళా కౌన్సిలర్ భర్తకు మధ్య వివాదం చోటు చేసుకుంది.నిడదవోలులో జనసేన నాయకుడు కందుల దుర్గేష్ మంత్రిగా ఉండడంతో ఛైర్మన్ పదవి చేజిక్కించుకునేందుకు జనసేన నాయకులు పావులు కదుపుతున్నారు. పట్టణంలో ఎక్కడచూసినా ఛైర్మన్ కుర్చీ కుమ్ములాటపైనే చర్చ జరుగుతుంది.



పాచిక పారలేదు!

- ఉమ్మడి జిల్లాలో ఖనిజ సీనరేజీ డబ్బులు ఎగ్గొట్టాలన్న సుధాకర్ ఇన్‌ఫ్రా ప్లాన్‌కు గండి
- బాకీ పడ్డ రూ.44 కోట్లు కట్టకుండా తప్పించుకోవాలన్న ప్రయత్నం బెడిసికొట్టిన వైనం
- కంపెనీ ఆటలు సాగనివ్వని ప్రభుత్వం : 15 రోజుల్లోగా జమ చేయాల్సిందేనని ఆదేశాలు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిచిపోయిన సీనరేజీ వసూళ్ల దందా
- గత జగన్ సర్కారు ఓ కంపెనీకి రూ.20 కోట్లు సీనరేజీ రద్దును సాకుగా చూపిన కంపెనీ
- ఆ రద్దు చేసిన సీనరేజీ వల్ల తనకు రాబడి తగ్గిపోయిందంటూ అడ్డగోలు వాదన
- తమ కంపెనీ కట్టాల్సిన బాకీలో ఆ డబ్బు మినహాయించాలంటూ తప్పించుకునే యత్నం
- ఈలోపు అనూహ్యంగా ప్రభుత్వం మారడంతో కంగుతిన్న సుధాకర్ ఇన్‌ఫ్రా

ప్రభుత్వానికి బాకీ పడ్డ ఖనిజ సీనరేజీ డబ్బులు ఎగ్గొట్టాలన్న సుధాకర్ ఇన్‌ఫ్రా కంపెనీ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. అడ్డగోలు వాదనలతో ప్రభుత్వ ఖజానాకు పంగనామాలు పెట్టాలనుకున్న ప్రణాళికలు పటాపంచలయ్యాయి. బాకీ డబ్బులు రూ.44 కోట్లు కట్టి తీరాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. అది కూడా 15రోజుల్లోగా ఖజానాకు జమచేయాలని హెచ్చరించింది. గత వైసీపీ ప్రభుత్వ అండతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ కంపెనీ యథేచ్ఛగా చెలరేగి పోయింది. ఎక్కడికక్కడ ముక్కుపిండి సీనరేజీ కోట్లలో వసూలుచేసింది. ప్రభుత్వానికి నెలకు రూ.9.70 కోట్లు కట్టి అంతకు పదింతలు రాబట్టేసింది. తీరా అనూహ్యంగా ప్రభుత్వం మారడంతో కంపెనీకి ఝలక్ తగిలింది. అడ్డగోలు సీనరేజీ దందా ఆగిపోయింది. ఈ సాకుతో సర్కారు బాకీ ఉన్న బకాయిలు కట్టకుండా తప్పించుకునే ప్రయత్నం చేసినా వారి పాచిక పారలేదు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గనులశాఖకు చిన్నతరహా ఖనిజాల ద్వారా ఏటా కోట్లలో ఆదాయం సమకూరుతోంది. గ్రావెల్, నల్లరాతి కొండలు, మట్టి, లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా భారీగా ప్రభుత్వానికి రాబడి వస్తోంది. అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా ఎక్కువ రాబడి వస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ రాబడి గనులశాఖకు బదులు మొట్టమొదటిసారిగా కోనసీమ జిల్లాకు చెందిన సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి అడ్డగోలుగా కట్టబెట్టేసింది. సీనరేజీ వసూలు బాధ్యత నుంచి గనులశాఖను తప్పించి సదరు కంపెనీకి అప్పగించేసింది. గనుల శాఖను డమ్మీగా మార్చేసి, సీనరేజీ వసూలు బాధ్యతంతా సుధాకర్ ఇన్‌ఫ్రాకు ఇచ్చేసింది. అందులోభాగంగా 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు ఈ కంపెనీ ఉమ్మడి జిల్లాలో సీనరేజీ వసూలు చేసుకునేలా అధికారం కట్టబెట్టింది. ఈ రెండేళ్లకు కలిపి రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తేచాలని, అది కూడా భారం అయితే ఇందులో నెలనెలా రూ.9.70కోట్లు చొప్పున 24 వాయిదాల్లో చెల్లించాలని వెసులుబాటు ఇచ్చింది. ఇలా కంపెనీకి పూర్తి సహకారం అందించి ప్రభుత్వ పెద్దలు తెరవెనుక భారీగా పిండేశారు. అటు ప్రభుత్వం అండదండలు ఉండడంతో సుధాకర్ ఇన్‌ఫ్రా ఉమ్మడి ఇటీవల ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఉమ్మడి జిల్లాను పిండేసింది. ఎక్కడికక్కడ కొండలు, గుట్టలు, గ్రావెల్, క్వారీలు ఉన్న ప్రతిచోటా సొంతంగా మనుషులను నియమించింది. సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసింది. ఎవరు ఏ చిన్న మట్టి,గ్రావెల్ తవ్వుకున్నా ముక్కుపిండి సీనరేజీ వసూలుచేసింది. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్లరాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి కూడా వదలకుండా నెలనెలా కోట్లలో రాబట్టింది. ఈ కంపెనీకి తెరవెనుక వైసీపీ పెద్దల సహకారం ఉండడంతో గనులశాఖ కళ్లు మూసేసుకుంది. సీనరేజీ వసూళ్లలో నిబంధనలు ఉల్లంఘించినా కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ.9.70 కోట్ల కంటే పదింతల రెట్టింపు ఆదాయం పిండేసింది. ఇలా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కంపెనీకి కాసుల పంట పండింది. రెండేళ్లలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తంలో సింహభాగం తొలి ఆరు నెలల్లోనే లాగేసింది.

సీనరేజి చెల్లించడం ఆపేసి..

అయితే అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయన్న సమయంలో సదరు కంపెనీ ప్రభుత్వానికి సీనరేజీ డబ్బులు చెల్లించడం ఆపేసింది. ఇదేంటని గనులశాఖ అడిగితే జగన్ ప్రభుత్వం కాకినాడ జిల్లాలో ఓ కంపెనీకి భారీ లబ్ధి చేకూర్చిందని మెలిక పెట్టింది. వాస్తవానికి ఎవరికీ తెలియకుండా గుట్టుగా గత ప్రభుత్వం జిల్లాలో తీరప్రాంతంలో పనులు చేస్తోన్న ఓ ప్రముఖ కంపెనీకి సహకరించింది. రౌతులపూడి నుంచి ఈ కంపెనీ 12 లక్షల మెట్రిక్ టన్నుల నల్లరాయి తరలించగా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.20 కోట్ల రాయల్టీని రద్దుచేసి మేలు చేకూర్చింది. ఇదంతా రహస్యంగా ఉంచింది. విషయం తెలుసుకున్న సుధాకర్ ఇన్‌ఫ్రా గనులశాఖపై ఒత్తిడి తెచ్చింది. ఆ కంపెనీకి రూ.20 కోట్ల రాయల్టీ రద్దు చేయడం వల్ల తమకు రావలసిన సీనరేజీ ఆదాయం పోయిందని అభ్యంతరం తెలిపింది. అందువల్ల తాము నెలనెలా చెల్లించాల్సి ఉన్న బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ కొత్తపాట పాడింది. అయితే కంపెనీ వెనుక వైసీపీ నేతలు ఉండడంతో గనులశాఖ మొత్తబడింది. దీంతో తన ఆటలు సాగినట్లేనని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన తన బాకీ కట్టకుండా ఉండొచ్చని లెక్కలేసుకుంది. ఎన్నికలు జరిగినా తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందనే ధీమాతో సదరు కంపెనీ అలా తన బాకీలు కట్టకుండా ఉండిపోయింది. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కంపెనీ కంగుతింది. ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా సీనరేజీ వసూలు కాంట్రాక్టు రద్దయిపోయింది. అటు కట్టాల్సిన బాకీలు చెల్లించాలంటూ గనులశాఖ ఒత్తిడి తేవడం మొదలుపెట్టింది. కొత్త ప్రభుత్వంలో పైరవీలు చేసి బాకీలు కట్టకుండా చేయాలని సదరు కంపెనీ ప్రయత్నాలు చేసింది. కానీ ప్రభుత్వం నుంచి సదరు కంపెనీకి సహకారం దొరకలేదు. సరికదా మొత్తం సీనరేజీ బాకీలన్నీ కలిపి రూ.44కోట్లు కట్టితీరాలని ఇటీవల గట్టిగా హెచ్చరించింది. 15రోజులలోగా ఖజానాకు డబ్బులు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. ముందు బాకీ చెల్లిస్తే తర్వాత రాయల్టీ రద్దులో సుధాకర్ ఇన్‌ఫ్రాకు అసలు సీనరేజీ రావలసి ఉందా? లేదా? తేల్చుదామని పేర్కొంది. దీంతో సుధాకర్ ఇన్‌ఫ్రా గింజుకుంటోంది.





వైద్య విద్యార్థిని హత్యపై నిరసన ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 16 : కోల్‌కత్తాలో వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి పాశవికంగా హత్యచేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేసారు. టీడీపీ వైద్యవిభాగం నాయకులు డాక్టర్ యాళ్ళ ప్రదీప్ ,డాక్టర్ కొమ్మాశ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం అంబేడ్కర్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నేరస్తులరే కఠినమైన శిక్షలు పడేలా చూడాలన్నారు. ఈ ర్యాలీలో డాక్టర్లు చలుమూరు తులసీ మోహనరావు, డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ దివ్య, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సంతోష్ ఇతర వైద్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వరములీయవే..వరలక్ష్మి..

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున భక్తులు హాజరై దర్శించుకున్నారు.. వరములీయవే వరలక్ష్మీ అంటూ కొలిచారు. రాజమహేంద్రవరం మహాలక్ష్మి ఆలయం వద్ద అమ్మవారి దర్శనానికి జనం బారులు తీరారు. దేవిచౌక్‌లో అమ్మవారిని ఎస్పీ నరసింహ కిశోర్ దర్శించుకున్నారు.



అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ బ్రిడ్జి వంతెనవద్ద కనువిందు చేసిన మేఘాలు

కారుమబ్బులు కమ్మిన వేళ...

కారుమబ్బులు కనువిందు చేశాయి. ఒకపక్క తీవ్రమైన ఎండ ఉన్నా మరోపక్క నల్లని మబ్బులు ఆకాశాన్ని కమ్ముకుని చూపరులను ఆనందపరవశం చేశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ బ్రిడ్జి వద్ద శుక్రవారం కనిపించిన ఈ అందమైన మేఘాలు ఔరా అనిపించాయి.

- అల్లవరం

ఏఎస్ఐకి ఐపీఎం అందజేత



ఏఎస్ఐ మాడా సత్యనారాయణకు పతకాన్ని అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న మాడా సత్యనారాయణ కు ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)ని ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం అందజేశారు. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సత్యనారాయణకు కేంద్ర ప్రభుత్వం ఐపీఎంని ప్రకటించింది. ఈ సందర్భంగా సత్యనారాయణను ఎస్పీ నరసింహ కిశోర్, అధికారులు, సిబ్బంది అభినందించారు. ఈ ఏడాది జిల్లా ఫైర్ ఆఫీసర్ చిన్నం మార్టిన్ లూథర్ కింగ్‌కు ఐపీఎం ప్రకటించింది. ఈ పతకాన్ని వచ్చే ఏడాది అందజేస్తారు.

19 నుంచి ఏపీఈఏపీసెట్

మూడోదశ వెబ్ ఆధారిత కౌన్సెలింగ్

- ఈనెల 21 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన
- 20 నుంచి 22 వరకూ వెబ్ ఆప్షన్ల నమోదు
- కాకినాడ ఏపీటీలో సహాయ కేంద్రం ఏర్పాటు

జేఎన్టీయూకే, ఆగస్టు 16: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లోని సీట్ల భర్తీకి సంబంధించిన ఏపీఈఏపీసెట్-2024 వెబ్ ఆధారిత కౌన్సెలింగ్‌ను మొదటి, రెండో దశ ద్వారా నిర్వహించారు. అయితే రాష్ట్రస్థాయిలో సుమారు 18వేలకు పైగా ఇంజనీరింగ్ సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయని వాటిని భర్తీచేసేందుకు మూడోదశ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి కూటమి ప్రభుత్వానికి, విద్యాశాఖామంత్రి నారాలోకేష్‌కి అభ్యర్థనలు రావడంతో సీటుకోసం ఎదురుచూస్తున్న ఏ ఒక్క విద్యార్థి నష్టపోకూడదని మూడో దశ వెబ్ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ఏపీఈఏపీసెట్-2024 మూడవ, తుది రౌండ్ ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 19 నుంచి ప్రారంభం కానుంది. దీని ద్వారా ఇంజనీరింగ్ కళాశాలల్లో మొదటి, రెండో దశ వెబ్‌కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఏపీఈఏపీసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ శుక్రవారం జారీ చేస్తున్నట్లు సమాచారం. ఈ కౌన్సెలింగ్ ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలోని 29 ఇంజనీరింగ్ కళాశాలల్లో మిగిలిపోయిన సుమారు 2900 సీట్లు భర్తీ కానున్నాయి. ఈనెల 19నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవచ్చని ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా కాకినాడ జగన్నాథపురం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రం సమన్వయ కర్త, ప్రిన్సిపాల్ ఎస్. జనార్థన్‌రావు తెలిపారు.

● అయితే మొదటి, రెండో దశ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరు కాని అభ్యర్థులు మాత్రమే షెడ్యూల్‌లో పేర్కొన్నవన్నీ చేయాలి. ఆవిధంగా కాకుండా మొదటి, రెండోదశ కౌన్సెలింగ్‌లో సీటు పొంది తుది దశకు కూడా ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు కేవలం వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకుంటే సరిపోతుంది. అంతేకాకుండా మొదటి, రెండో దశలో పొందిన సీటు మూడోదశలో సంబంధిత విద్యార్థికి సీటుకేటాయింపు జరిగిన వెంటనే రద్దవుతుంది. ఇప్పటివరకూ వెబ్‌కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు, అదే విధంగా కళాశాలలో చేరని విద్యార్థులు ఈఅవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి.

● అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసిన సహాయకేంద్రంలో సంప్రదించాలి. అంతేకాకుండా 7995681678, 7995865456, 9177927677 హెల్ప్ డెస్క్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

● ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇలాచేసుకోవాలి

అభ్యర్థులు మొదటిగా https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి అడ్మిషన్లపై క్లిక్ చేయాలి అనంతరం వచ్చిన ఫారంలో హాల్ టికెట్ నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం వస్తోంది. అందులో అడిగిన సమాచారం క్షుణ్ణంగా నింపి సబ్‌మిట్ చేయాలి. అనంతరం పది, ఇంటర్ మార్కుల జాబితాలు, 6నుంచి ఇంటర్ వరకూ స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ర్యాంకు కార్డు,రేషన్ కార్డు, హాల్ టికెట్లను అప్‌లోడ్‌చేయాలి. ఈడబ్ల్యూఎస్ కులధ్రువీకరణపత్రం ఉన్న వారికి 2022నుంచి 10శాతం రిజర్వేషన్‌ను ప్రతీఏడాది అమలుచేస్తున్నారు.

విద్యార్థులు సిద్ధం చేసుకోవాల్సినవి

ర్యాంకు కార్డు, మార్కులజాబితా, హాల్‌టికెట్, పుట్టినరోజు, టీసీ, స్టడీ ధ్రువపత్రం, ఈడబ్ల్యూఎస్, నివాస, కులధ్రువీకరణ, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలను విద్యార్థులు సిద్ధం చేసుకోవాలి.

షెడ్యూల్ ఇదే

- ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల పరిశీలన : ఈనెల 19 నుంచి 21 వరకూ.
- అప్‌లోడెడ్ ధ్రువపత్రాల పరిశీలన : ఈనెల 19 నుంచి 22 వరకూ
- వెబ్ ఆప్షన్ల నమోదు :ఈనెల 20 నుంచి 22 వరకూ.
- ఆప్షన్ల మార్పు : ఈనెల 23
- సీట్ల కేటాయింపు : ఈనెల 26
- సెల్ఫ్ రిపోర్టింగ్, కళాశాలల్లో రిపోర్టింగ్ : ఈనెల 26 నుంచి 30 వరకూ



పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

వరలక్ష్మీ శోభ

● పాదగయకు పోటెత్తిన భక్తులు...
● పుష్కరిణిలో స్నానాలు ● బంగారం చీరతో దర్శనమిచ్చిన బాలాత్రిపుర సుందరీ అమ్మవారు

పిఠాపురం, ఆగస్టు 16: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. క్షేత్రానికి శ్రావణవరలక్ష్మీ శోభ చేకూరింది. పాదగయ పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించి పూజలు చేశారు. పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వెలసిన రాజారాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తిపీఠాల్లో దశమశక్తి పీఠాధిపతి అయిన పురుహూతికా అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం వరలక్ష్మీవ్రత పూజల సందర్భంగా వ్రతాన్ని ఆచరించే భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లకు కుంకుమపూజలు, ప్రత్యేక అర్చనలు జరిగాయి. పుష్పార్చన చేశారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవారు

బంగారు చీరలో బాలాత్రిపురసుందరి

పోర్టుసిటీ (కాకినాడ): కాకినాడలో ప్రసిద్ధి చెందిన స్థానిక సూర్యారావుపేటలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారు భక్తులకు బంగారుచీరలో దర్శనమిచ్చారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని అమ్మవారి ని దర్శించుకునేందుకు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామునుంచే దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చింతపల్లి విజయభాస్కరరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.



కాకినాడలో బంగారు చీర అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు



సామర్లకోట భీమేశ్వరాలయంలో వెండి చీర అలంకరణలో అమ్మవారు

వెండిచీర అలంకారంలో బాలాత్రిపుర సుందరి

సామర్లకోట: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఉన్న బాలాత్రిపురసుందరి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా విశేషపూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరులచే విశేష పుష్పార్చన పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారిని సుమారు 30కిలోలతో రూపొందించిన వెండిచీరతో సర్వాంగసుం దరంగా అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు.



మామిడికుదురు: అప్పనపల్లి ఆలయంలో గాజుల అలంకరణలో పద్మావతి అమ్మవారు



వాడపల్లిలో పవిత్రాలతో కొలువుతీరిన ఉత్సవమూర్తులు, మహా పూర్ణాహుతిలో ఎమ్మెల్యే, ఎంపీ

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

● మూడు రోజుల పాటు పూజలు ● పాల్గొన్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, ఆగస్టు 16: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజులపాటు తిరుమల తరహాలో క్రతువును వైఖానసాగమశాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వసంత మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను పవిత్రా లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాశాంతి హోమం, ప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, పవిత్రవిసర్జన, మహాదాశ్వీరచనంలను వైభవంగా నిర్వహించారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మహా పూర్ణాహుతిలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉపకమిషనరు కిషోర్‌కుమార్, దేవదాయశాఖ జిల్లా అధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, అధికార పార్టీ ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

25న జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నిక

● 12 డైరెక్టర్ పదవులకు 37 నామినేషన్లు దాఖలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోపరేటివ్ అర్బన్ పాలక వర్గ ఎన్నికలకు శుక్రవారం మొత్తం 37 మంది నామినేషన్లు దాఖలు చేసినట్టు రాజమహేంద్రవరం డివిజనల్ కోపరేటివ్ అధికారి, ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఛైర్మన్ అభ్యర్థి బొమ్మన జయకుమార్‌తోపాటు ప్రస్తుత పాలకవర్గ డైరెక్టర్ ప్రసాదుల హరనాథ్ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు. బ్యాంక్‌కు సంబంధించిన మొదటి నియోజకవర్గంలో 10 డైరెక్టర్ పదవులకు 30మంది నామినేషన్లు దాఖలుచేయగా, 2వ నియోజక వర్గంలో ఒక పదవి కోసం ఇద్దరు, మూడో నియోజకవర్గంలో ఒక పదవి కోసం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం స్క్రూట్నీ ఉంది. ఆదివారం నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. జాంపేట ప్రధాన బ్యాంక్ పరిధిలోని 10మంది కంటే ఎక్కువమంది నిలబడితే ఎన్నిక తప్పదు. మిగతాచోట్ల ఒకరికన్నా ఎక్కువ మంది ఉన్నా పోలింగ్ తప్పదు. 25న పోలింగ్ నిర్వహిస్తారు. ఛైర్మన్ అభ్యర్థి బొమ్మన జయకుమార్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు హాజరయ్యారు. బ్యాంక్‌లో సుమారు 32వేలకుపైగా ఓటర్లు ఉండగా 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారన్నారు. ప్రధాన బ్రాంచి జాంపేట, మోరంపూడి ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, గోకవరం, పెద్దాపురం, కాకినాడ, ఏలూరు, కొవ్వూరుల్లో మొత్తం 10 బ్రాంచిలు ఉన్నాయన్నారు. ఈ బ్యాంక్ పరిధిలోని బ్రాంచిలను మూడు నియోజకవర్గాలుగా విభజించారు. మొదటి నియోజకవర్గంలో జాంపేట మెయిన్ బ్రాంచి ఒకటి. ఇక్కడ 15,623 మంది ఓటర్లు ఉన్నారు. మోరంపూడి బ్రాంచిలో 2142 మంది ఓటర్లు, ధవళేశ్వరం బ్రాంచిలో 3221 మంది ఓటర్లు, సీతంపేట బ్రాంచిలో 2766 మంది ఓటర్లు కలిపి మొత్తం 23,752 మంది ఉన్నారు. వీరు మొత్తం 10 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఇక నియోజకవర్గం 2 పరిధిలో మొత్తం 1901 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. ఈ నియోజకవర్గం పరిధిలో రెండు బ్రాంచిలు ఉన్నాయి. అనపర్తిలో 963 మంది ఓటర్లు ఉన్నారు. గోకవరం బ్రాంచిలో 938 మంది ఉన్నారు. మూడో నియోజకవర్గంలో నాలుగు బ్రాంచిలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 2071 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. పెద్దాపురం బ్రాంచిలో 963 మంది, కాకినాడ బ్రాంచిలో 834 మంది, ఏలూరు బ్రాంచిలో 480 మంది, కొవ్వూరు బ్రాంచిలో కేవలం ఏడుగురు ఓటర్లు ఉన్నారు.

గంజాయి తాగాలని వేధించినందుకు హత్య

● హత్య కేసులో నిందితుల అరెస్ట్



రాజోలులో నిందితుల వివరాలు తెలుపుతున్న సీఐ గోవిందరాజు

రాజోలు, ఆగస్టు 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెల్లంకకు చెందిన పడమటి నోయల్‌జార్జిన్‌ను హత్య చేసిన కేసులో నిందితులు రాపాక ప్రకాష్, ప్రశాంతి, యర్రంశెట్టి ప్రేమ్‌కుమార్లను శుక్రవారం అరెస్టు చేసినట్టు రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపారు. రాజోలు సర్కిల్ కార్యాలయంలో ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మలికిపురానికి చెందిన నోయల్‌జార్జి కనిపించడంలేదని నోయల్ తండ్రి పడమటి రత్నంరాజు మలికిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ఉత్తర్వుల ప్రకారం కొత్తపేట డీఎస్పీ ఆదేశాలతో సీఐ ఆధ్వర్యంలో మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. గుడిమెల్లంకకు చెందిన రాపాక ప్రశాంతి ఆరు నెలల క్రితం మలికిపురానికి చెందిన నోయల్‌జార్జిను ప్రేమించింది. వీరు కాకినాడలో నివాసం ఉన్నారు. నోయల్‌జార్జి మందు, సిగరెట్, గంజాయికి బానిసై ప్రశాంతిని కూడా తాగమని వేధించేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక ప్రశాంతి ఈనెల 9న అన్నయ్య రాపాక ప్రకాష్‌కు విషయాన్ని వివరించింది. ప్రకాష్ తన స్నేహితుడు రాజోలుకు చెందిన యర్రంశెట్టి ప్రేమ్‌కుమార్, ప్రశాంతితో కలిసి నోయల్‌జార్జిని హత్య చేసేందుకు ప్రణాళిక చేశారు. ఈనెల 9వ తేదీన రాత్రి ప్రశాంతితో నోయల్‌జార్జికి ఫోన్ చేయించి దిండి-చించినాడ బ్రిడ్జి వద్దకు రప్పించారు. ఇనుపరాడ్లతో జార్జిని కొట్టి చంపి గోదావరిలోకి పడేశారు. జార్జి బైక్‌ను బ్రిడ్జి వద్ద పెట్టి అక్కడి నుంచి అదృశ్యమైనట్టు సృష్టించి పరారయ్యారు. ఈనెల 13న జార్జి మృతదేహం అంతర్వేది పల్లిపాలెం అన్నాచెల్లెల గట్టు సమీపంలో గోదావరి గట్టున లభ్యమైంది. ఈనెల 15న దిండి చెక్‌పోస్టు వద్ద నిందితులు ప్రకాష్, ప్రేమ్‌కుమార్, ప్రశాంతిని అరెస్టు చేశామన్నారు.

చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా బదిలీ



బదిలీపై వెళుతున్న చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా

చింతూరు, ఆగస్టు 16: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్రముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాహుల్‌మీనా గత ఏడాది మే1న చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. రాహుల్‌మీనాకు పదోన్నతి కల్పిస్తూ ఎస్ఆర్‌పీ గుంతకల్ ఎస్పీగా బదిలీ చేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన పంకజ్‌కుమార్ మీనాకు చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పంకజ్ కుమార్ మీనా ఇప్పటివరకు గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్‌గా విధులు నిర్వర్తించారు.

నేడు జీఎస్ఎల్-స్వతంత్ర హాస్పిటల్స్ వార్షికోత్సవం

రాజానగరం, ఆగస్టు 16: ఈనెల 17న జీఎస్ఎల్-స్వతంత్ర హాస్పిటల్స్ 38వ వార్షికోత్సవాన్ని రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు సినీ దర్శకుడు వి.సందీప్ రెడ్డి వంగా ముఖ్యఅతిథిగా విచ్చేస్తార న్నారు. గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎస్పీ నరసింహ కిశోర్ పాల్గొంటున్నట్టు చెప్పారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు వీర్రాజు

ఆలమూరు, ఆగస్టు 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మోదుకూరులో పంట చేలో ఒక రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గుమ్మిలేరుకు చెంది న ముచ్చారి వీర్రాజు (40)గ్రామ సరిహద్దులో ఉన్న మోదుకూరు పంట భూములలోకి పాడిగేదెకు పచ్చగడ్డి నిమిత్తం వెళ్లాడు. పచ్చగడ్డి కోసి మోపు తీసుకుని వస్తుండగా 33కేవీ విద్యుత్‌లైన్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. వీర్రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఏఎన్ఎం దుర్మరణం



మృతిచెందిన ఏఎన్ఎం నాగసత్యవేణి

సామర్లకోట, ఆగస్టు 16: కాకినాడ జిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ సమీపాన స్కూటీపై వస్తున్న ఏఎన్ఎంను లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని వేట్లపాలెం పీహెచ్‌సీలో ఏఎన్ఎంగా పని చేస్తున్న నాగసత్యవేణి (39) శుక్రవారం సాయంత్రం స్కూటీపై సామర్లకోట వైపు వస్తుండగా ఓవర్‌టేక్ చేస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ఏఎన్ఎం తీవ్రంగా గాయపడింది. తలకు బలమైన గాయాలుకావడంతో హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్పటివరకు తమతో విధులలో పాల్గొన్న తమ సహచరురాలు నాగసత్యవేణి ప్రమాదంలో మృతి చెందిందన్న సమాచారం తెలిసి వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేసును సామర్లకోట పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుషోత్తపట్నం దేవస్థానం భూముల్లో

మళ్లీ రాజుకున్న రగడ

● కోర్టు ధిక్కారణ కేసున్నా పురుషోత్తపట్నంలో ఆగని నిర్మాణాలు
● భద్రాద్రి దేవస్థానం ఈవోపై దాడికి యత్నం, అడ్డుకున్న సిబ్బంది

ఎటపాక ఆగస్టు 16 : ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి రామయ్య భూముల్లో మళ్లీ ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో రాష్ట్ర హైకోర్టు భద్రాద్రి దేవస్థానంకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా దానిని నిర్ణీత సమయంలో అమలు చేయకపోవడంతో భద్రాద్రి దేవస్థానం రాష్ట్రీయ వానరసేన కోర్టు ధిక్కరణ పిటీషన్ హైకోర్టులో దాఖలు చేశాయి. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలు చోటుచేసుకోకుండా చూడాల్సిన రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛ గా అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయని దేవస్థానం అధికార వర్గాలు ఆరోపిస్తున్నాయి. పురుషోత్తపట్నంలోని శ్రీగోకులంకు ఎదురుగా ఉన్న ఖాళీ భూముల్లో గత రెండు నెలలుగా అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్నా రెవెన్యూశాఖ అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో శుక్రవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, తన సిబ్బంది అక్కడికి చేరుకొని అక్రమ నిర్మాణంను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. ఇదే సమయంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవిపై దాడికి ప్రయత్నించగా దేవస్థానం సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సమయంలో పలువురు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలను తొలగించే ప్రయత్నం సిబ్బంది చేస్తుండగా వాటిని ఇంటి నిర్మాణదారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో మళ్లీ వాగ్వివాదం, దూషణలు చోటుచేసుకున్నాయి. ఎస్ఐ పార్థసారథి తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని నిర్మాణం చేస్తున్న వారిని పనులు ఆపాలని స్పష్టం చేశారు.



దేవస్థానం అధికారులు, నిర్మాణదారుల మధ్య తోపులాట దృశ్యం

మీరు తొలగిస్తారా.. ...మేమే తొలగించాలా..

ఎటపాక ఆర్ఐతో దేవస్థానం ఈవో రమాదేవి

నేను కూడా రెవెన్యూ డిపార్టుమెంటు నుంచే వచ్చాను...దేవస్థానం భూముల్లో నిర్మాణాలు జరుగుతుంటే మీరేం చేస్తున్నారని ఆర్ఐ బాపిరాజును దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి నిలదీశారు. రామాలయ భూముల్లో ఇళ్ల కట్టేందుకు పట్టా ఉందా....లేక అనుమతులు ఉన్నాయా.. మేము తీసేందుకు వస్తే మాత్రం మీరొస్తున్నారు... అక్కడి వారు నిర్మాణ పనులు చేస్తుంటే మీరు దగ్గరుండి ఏం చేస్తున్నారని ఈవో ఆర్ఐని ప్రశ్నించారు. మీ వ్యక్తిగత ఆసక్తి ఏమైనా ఉందా, రెవెన్యూ శాఖ తరఫున మీరేం చేస్తున్నారని ఆర్ఐని ఈవో నిలదీశారు. రాముడి భూములంటే మీకు బాధ్యత లేదా, గత ప్రభుత్వ హయాంలో అధికారులు పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన తరువాత ఇరువురు సీఎంలు భూముల విషయమై చర్చిస్తున్నారు. ఈ సమయంలో కూడా మీరు ఎందుకు పట్టించుకోవడంలేదని ఆమె ప్రశ్నించారు.

ఏజెన్సీ సమాచారం

108లో ప్రసవం

● మార్గమధ్యలో పురుడుపోసిన వైద్యురాలు ● తల్లీబిడ్డ క్షేమం
● మెరుగైన వైద్యం కోసం సీహెచ్‌సీకి తరలింపు



బిడ్డతో వస్తున్న వైద్యురాలు

చింతూరు, ఆగస్టు16: ఓ గర్భిణీ పురిటినొప్పులతో చింతూరు సామాజికఆరోగ్య కేంద్రానికి వెళుతుండగా 108వాహనం మార్గమధ్యలో నిలిచిపోవడంతో ఈ విషయం తెలుసుకున్న ఏడుగుర్రాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు విశ్వచైతన్య స్పందించి మార్గమధ్యలోనే పురుడుపోసి తల్లీబిడ్డను రక్షించిన ఘటన శుక్రవారం మన్యంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి. వీఆర్ పురం మండలం పత్తిపాక గ్రామానికి చెందిన మడివి పార్వతి నిండు గర్భిణి తన తల్లి స్వగ్రామమైన చింతూరు మండలంలోని వంకగూడెంనకు వచ్చింది. ఈ క్రమంలో ఉదయం ఆకస్మికంగా పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు చింతూరు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే స్పందించి వంకగూడెం గ్రామానికి వెళ్లి గర్భిణీని చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రాకి తరలిస్తున్న తరుణంలో 108 వాహనం సరివెల గ్రామ శివారు ప్రాంతానికి రాగానే 108 వాహనం టైర్ పంక్చర్ అయింది. ఈ విషయాన్ని ఏడుగుర్రాలపల్లి వైద్యురాలికి సమాచారం అందించడంతో తక్షణమే స్పందించి ఆమె ఐటీడీఏ అంబులెన్స్ తీసుకుని ఘటనా స్థలానికి చేరుకుని పురుటినొప్పులతో బాధపడుతున్న గర్భిణీకి మార్గమధ్యలోనే 108 సిబ్బంది సహాయంతో పురుడు పోశారు. వైద్యురాలు స్పందించి పురుడుపోయడంతో తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చింతూరు సీహెచ్‌సీకి తరలించారు.

వైభవంగా వరలక్ష్మీ పూజలు



వరరామచంద్రాపురం, ఆగస్టు 16: మండలంలోని దేవాలయాల్లో ఘనంగా వరలక్ష్మి వ్రతంపూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో రెండవ శుక్రవారం పురస్కరించుకొని వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు. వడ్డిగూడెంలోని శ్రీరుద్రకోటేశ్వర ఆలయంలోను, వీఆర్‌పురంలోని అమ్మ వారి ఆలయంలోను మహిళలు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లోనే కాకుండా ప్రతి ఇంటిలోను వరలక్ష్మి పూజలు నిర్వహించారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెంలో శుక్రవారం వరలక్ష్మి పూజలు గ్రామంలో ప్రతి ఇంట ఘనంగా నిర్వహించారు. లక్ష్మి అమ్మవారిని అలంకరించి నానావిధ పరిమళ పుష్పాలతో ముత్తయిదువులందరూ లక్ష్మీదేవిని పూజించారు. అనంతరం ముత్తైదువులను తాంబూలాలు ఇచ్చి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

విలీన మండలాల సమస్యలు పరిష్కరిస్తాం



లోకేశ్‌ను కలిసిన అభిచర్ల సర్పంచ్

కూనవరం, ఆగస్టు 16: విలీన మండలాల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని పోలవరం నిర్వాసితులను ఆదుకుంటామని రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చినట్లు అభిచర్ల సర్పంచ్ కారం రాణి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా ఆమెకు అమరావతిలో ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆమె మంత్రి లోకేష్‌ను కలిసి ముంపు మండల సమస్యలు వివరించారు. వరద బాధితులను ఆదుకున్నామని అలాగే పోలవరం ముంపునకు గురయ్యే ప్రతీ గ్రామ ప్రజలకు పరిహారం ఇస్తామని తెలిపారు. అదేవిధంగా ఏజెన్సీలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామని లోకేష్ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.

ఎక్సైజ్‌శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే శిరీషదేవి




ఎక్సైజ్‌శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, ఆగస్టు 16: రాష్ట్ర మైన్స్, జియాలజీ, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను విజయవాడలో శుక్రవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను మంత్రికి వివరించా రు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

గర్భాశయంలో కణితి తొలగించిన వైద్యులు

చింతూరు, ఆస్టు16: మండలంలోని లక్ష్మీపురం పీహెచ్‌సీ పరిధిలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఇరపా రాములమ్మ అనే మహిళకు గర్భాశయంలో పది సెంటీమీటర్ల సైజులో కణితి ఉంది. దీంతో ఈమెకు ఆపరేషన్ అవసరమని గుర్తించిన పీహెచ్‌సీ వైద్యులు చింతూరు ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో ఆమెకు శుక్రవారం చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు ఎంపీ కోటిరెడ్డి నేతృత్వంలో డాక్టర్లు వైవీ రమణారావు, శశికళలు, ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం రాములమ్మ ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలోస్టాఫ్ నర్స్ కుమారి, వినయ్, కనకమ్మ పాల్గొన్నారు.

సీఐగా కన్నపరాజు బాధ్యతల స్వీకరణ



ఎటపాక, ఆగస్టు 16 : చింతూరు సబ్ డివిజన్ పరిధిలోని ఎటపాక సీఐగా ఎం.కన్నపరాజు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. కన్నపరాజు ఇదివరకు రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఆయన్ను సీఐల బదిలీల్లో భాగంగా ఎటపాకకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా సీఐ కన్నపరాజు మాట్లాడుతూ.. ఎటపాక సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తాన ని చెప్పారు. ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉంటానని, తనను నేరుగా కలవవచ్చని పేర్కొన్నారు. సీఐను టీడీపీ నాయకులు నలజాల శ్రీకాంత్‌చౌదరి, పాటి సంపత్, బాచినేని శ్రీకాంత్, బొల్లా పుల్లయ్య, దానే రాజు మర్యాదపూ ర్వకంగా కలిశారు.

ఎటపాక ఎంపీడీవో బాపన్నదొర బాధ్యతల స్వీకరణ



ఎటపాక, ఆగస్టు16: ఎటపాక ఎంపీడీవోగా కె.బాపన్నదొర శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీక రించారు. వై.రామవరం మండలంలో అదనపు బా ధ్యతలతో ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆయన్ను ఎటపాకకు బదిలీ చేశారు. ఇప్పటివరకు ఎటపాక ఎంపీడీవోగా మురళీకృష్ణ బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ము రళీకృష్ణ ఎటపాకకు వచ్చారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమ్మెకు మద్దతు

కూనవరం, ఆగస్టు 16: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమ్మెకు ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ మద్దతిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని రాష్ట్ర రాజధాని కలకత్తాలో ఆర్‌జీసీఎఆర్ మెడికల్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారంచేసి చంపిన ఘటన దేశ చరిత్రలో మాయనిమచ్చ అన్నారు. ఇటువంటి సంఘటనలు జరుగకుండా కఠిన మైన చట్టం తీసుకురావాలన్నారు. వైద్యులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరికీ ఉందన్నారు. ఆసుపత్రిలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

రంపచోడవరంలో వాజ్‌పేయి వర్ధంతి

రంపచోడవరం, ఆగస్టు 16: భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహార్ వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. రంపచోడవరం బూత్ నెం. 209లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోళ్ళ బొజ్జిరెడ్డి, కార్యదర్శి కుండ్ల కృష్ణారెడ్డి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

రంగంపేట, ఆగస్టు 16: ఉపాధి హామీ పనులకు సంబంధించి ఈ నెల 17న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరుగుతుందని ఏపీవో వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన కన్వర్జెన్స్ పనులు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లపై మండలంలో ఈ నెల 6నుంచి 16వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించిందన్నారు. శనివారం జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది హాజరు కావాలని ఏపీవో కోరారు.

వరాలిచ్చే.. వరలక్ష్మి

» భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం.. ముత్తయిదువులకు వాయనాలు
» భక్తులతో పోటెత్తిన అమ్మవారి ఆలయాలు



రాజమహేంద్రవరంలో మహాలక్ష్మి ఆలయం వద్ద అమ్మవారికి దర్శనానికి బారులుదీరిన భక్తులు



ధవళేశ్వరంలో విశేష అలంకరణలో బాలాత్రిపుర సుందరి దేవి

దివాన్‌చెరువు/కోరుకొండ, ఆగస్టు 16: శ్రావణమాసంలో పౌర్ణమికి ముందువచ్చిన శుక్రవారం సందర్భంగా ఇంటింటా మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాన్ని జరుపుకున్నారు. వేకువఝామునే లేచి పుణ్యస్నానాలను ఆచరించి, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి గోధూళి వేళలో వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. ఇల్లంతా తోరణాలు బంగారు వరలక్ష్మి రూపులు, నూతనవస్త్రాలు, 9 రకాల పిండి వంటలు, వివిధ రకాల పండ్లు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వివిధ రకాల పత్రిలు, పూలతో అమ్మవారిని పూజించారు. చామంతి పూలతో తయారుచేసి, 9 ముడులు వేసిన పసుపు తోరాలకు పూజలు చేసి అనంతరం వాటిని కుడి చేతికి ధరించి వరలక్ష్మి వ్రత కథ చదువుకున్నారు. శ్రద్ధగా ఆలకించిన ముత్తాదువులకు 11 కుడుములతో వాయనాలు అందజేశారు. పెద్ద వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా తమ గృహాలను, అమ్మవారి ఆలయాలను మామిడితోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. లలిత సహస్ర నామ స్తోత్రాలను పలువురు పారాయణం చేశారు. కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామి, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, రాజరాజేశ్వరి, దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గాదరాడ ఓం శివశక్తి పీఠంలో, కోరుకొండ హరేరామ సమాజంలో ప్రత్యేక కుంకుమ పూజలు జరిగాయి. రాత్రి కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద లక్ష్మీదేవికి దర్బారు సేవ నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవళి, పెదపాటి, అనువంశక, అర్చక స్వాములు, అధ్యాపక స్వాములు, వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారిని పల్లకిలో ఆశీనులను చేసి మూడుసార్లు మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేద ఘోషతో దర్బారు సేవ జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో లక్ష్మీనారాయణ స్వామి ఆలయం, గోలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లను అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమ పూజలు చేశారు. ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయాల ఈవో ఆకెళ్ల భాస్కర్ భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు.

ధవళేశ్వరం: పురాణ ప్రసిద్ధి గాంచిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపుర సుందరి దేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరంలో దేవీచౌక్ శ్రీ బాలాత్రిపుర సుందరి ఆలయాన్ని విద్యుత్ కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని పెద్ద ఎత్తున మహిళలు దర్శించుకున్నారు. ఏవీఅప్పారావు రోడ్డులోని మహాలక్ష్మీ దేవి, వంకాయల వారి వీధిలోని అష్టలక్ష్మీదేవి, శ్రీ ఉమా మార్కండేశ్వర స్వామి ఆలయంలోని పార్వతి అమ్మవారిని, ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరి, విశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి, బాలాత్రిపుర సుందరీదేవి, జాంపేట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ పర్వత వర్ధని అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు.

వికసిత ఏపీ-2047 దిశగా కార్యాచరణ

» జిల్లాలో 9 విభాగాల ఆధ్వర్యంలో కమిటీలు
» చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అప్పలకొండ



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలకొండ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 16: వికసిత ఆంధ్రప్రదేశ్-2047 దిశగా కార్యాచరణ రూపొందించాలని చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీవో) ఎల్.అప్పలకొండ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన వికసి త ఏపీ-2047లో భాగంగా 2024-29 కార్యాచరణ ప్రణాళిక దృష్టి కోణంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ 12 అంశాల ప్రాతిపదికన అభివృద్ధి సామర్థ్యం ప్రణాళికలను సిద్ధం చేసుకుని అమలు దిశగా కార్యాచరణ రూపొందించాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన వర్క్ షాప్‌లో ఆ మేరకు రాష్ట్రంలో అమలు చేయాలని వాటిపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. అలాగే జిల్లా స్థాయిలో కూడా ఆయా శాఖలు నివేదిక అందజేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవా రంగం వారీగా 9 విభాగాల ఆధ్వర్యంలో జిల్లాలో కమిటీలు వేసినట్టు సీపీవో చెప్పారు. పరిశ్రమల శాఖ జిల్లా ప్రోత్సాహక అధికారి టీవీ సూర్యప్రకాష్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రణాళిక రూపొందించడం దృష్టి కోణం తయారీపై అనుబంధ శాఖల అధికారులు సంబంధిత మునిసిపాలిటీ, మండల స్థాయిలో ఫీల్డ్‌తో ఈనెల 26 నుంచి 31వ తేదీ మధ్య నిర్వహించాల్సి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహించడమే కాకుండా ఈ విషయాన్ని సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా దృక్పథ ప్రణాళికను రూపొందించడానికి పర్యవేక్షణ చేయాలన్నారు. ఏపీఎంఐపీ అధికారి ఎ.దుర్గేష్ మాట్లాడుతూ విజన్ ప్లాన్‌పై జిల్లాలో 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు వచ్చేనెల 10నుంచి 14వరకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తారని తెలిపారు. జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికసిత ఆంధ్ర విజన్‌ని ప్రాచుర్యంలోకి తీసుకురావాలని మాస్టర్ ట్రైనర్ తెలిపారు. వచ్చేనెల 1నుంచి 15 వరకు ప్రజలకు మండల, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు.సమావేశంలో కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీకలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి పీకే పి.ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, వ్యవసా యాధికారి ఎస్.మాధవరావు, ఎల్‌డీ ఎండీపీ ప్రసాద్, డీఎల్‌డీవో వి.శాంతామణి, డ్వామా పీడీ ఎ.ముఖలింగం, హార్టికల్చర్ అధికారి బి.సుజాత పాల్గొన్నారు.

పటిష్టంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు

విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో మార్గదర్శకాలను అనుసరించి కమిటీ సమావేశం కాలేదన్నారు. జిల్లాలోని కేసుల వారీగా సమగ్ర వివరాలను అందజేయాలని ఆదేశించామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నివారణ కమిషన్ రాష్ట్రంలో పర్యటించిన దృష్ట్యా జిల్లాలోని ప్రజాప్రతినిధులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు. కేసులను పరిష్కరించే విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు, పరిహారం, కేసు స్థాయి తదితర అంశాలపై అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి రోస్టర్ పాయింట్ల వారీగా పోస్టుల భర్తీపై ఆయా శాఖలు నివేదిక అందజేయాలన్నారు. పౌర హక్కుల అమలు తీరును క్షేత్ర స్థాయిలో గమనించడానికి ప్రతి శనివారం పర్యటన చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ దశలో 1509, కన్విక్షన్ స్టేజిలో ఒకటి, చార్జిషీటు దశలో 67 కేసులు ఉన్నాయన్నారు. మహిళల భద్రత, పీవోపీ చట్టం అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ డి.నరసింహ కిశోర్ పేర్కొన్నారు.ఈ మేరకు తమ సిబ్బందికి దిశా నిర్దేశం చేశామ న్నారు. ఇప్పటికే కేసుల వారీగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, కమిటీ సభ్యులు ఐ.సత్యనారాయణ, ఎ.చిన్నరాజు, టి.బాలు, కౌన్సిలర్లు బి.జార్జి ఆంటోనీ, డి.రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

‘వయ్యారిభామ’తో అనర్థాలెన్నో!

కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ నాయుడు

» కలుపు మొక్క పార్థీనియంపై అవగాహన వారోత్సవాలు



కేవీకేలో అవగాహన వారోత్సవాలు ప్రారంభిస్తున్న నాయుడు

రాజానగరం, ఆగస్టు 16: వయ్యారి భామ కలుపు మొక్కలు పంటతోపాటు పశువులకు ఎనలేని అనర్థాలు తెచ్చిపెడుతుందని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు పేర్కొన్నారు. సీటీఆర్ఐ, కలవచర్ల కేవీకేలో వయ్యారి భామ(పార్థీనియం)కలుపు మొక్కపై శుక్రవారం అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ సాధారణంగా వయ్యారి భామగా పిలిచే ఈ మొక్కను కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్ర కలుపు అనే పేర్లతో పిలుస్తారన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్కని, ఇది స్రవించే కొన్ని రకాల రసాయనాల వల్ల సహచర మొక్కల పెరుగుదల నశించిపోతుందని, మనుషులకు ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు వస్తాయని చెప్పారు. ఈ మొక్క ఆకులు చర్మానికి తాకితే దద్దుర్లు ఏర్పడతాయని, దీని గాలిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబడడం, కనురెప్పల వాపు వస్తాయని, పొలాల్లో పనిచేసే వారికి చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయని చెప్పారు. సాధారణంగా ఈ మొక్కను పశువులు తినవని, పొరపాటున తింటే వాటి జీర్ణక్రియ, మూత్రపిండాలు, కాలేయం, అన్నవాహిక, శ్వాసక్రియ దెబ్బతింటాయని వివరించారు. పాలిచ్చే పశువులు తింటే పాల నాణ్యత తగ్గి దుర్వాసన కలిగి రుచి లేకుండా చేదుగా ఉంటాయన్నారు. వయ్యారిభామ మొక్కలను పూత దశకు రాకముందే వేళ్లతో సహా పీకి తగల బెట్టాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో 10 లీటర్ల నీటికి 5 కిలోల ఉప్పు కలిపి ద్రావణాన్ని పిచికారీ చేస్తే ఈ మొక్కలు మొలకెత్తవని చెప్పారు. లేదా 2,4డి లేదా పారక్వాట్ అనే కలుపు మందులు పిచికారీ ద్వారా వయ్యారి భామ అంతరించిపోతుందన్నారు. సామూహిక భాగస్వామ్యంతో దీన్ని వ్యాప్తిని అరికట్టాలని నాయుడు అన్నారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది జేవీఆర్ సత్యవాణి, రఘునందన్, నాగేశ్వర్‌రెడ్డి, రవీందర్, సంజయ్ హెగ్డే, విజయవర్ధన్, ప్రభాత్, విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలకు చెందిన వ్యవసాయ విద్యార్థినులు పాల్గొన్నారు.

సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లులు ఆదా

» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



మహేంద్రవాడలో సోలార్ రూఫ్ టాప్ సబ్సిడీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి ఆగస్టు 16: సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవడమే కాకుండా ప్రభుత్వ అవసరాలకు విద్యుత్‌ను విక్రయించవచ్చని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సూర్యఘర్ యోజన పథకం ద్వారా మండలంలోని మహేంద్రవాడలో డాక్టర్ కృష్ణారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వినియోగదారుడు ఏర్పాటు చేసుకునే సోలార్ సెట్‌కు కేంద్రం కిలో వాట్‌కు రూ.30వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. వినియోగదారులు సోలార్ వినియోగం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా సబ్సిడీ వివరాలతో రూపొందించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఇదిలా ఉండగా కొమరిపాలెం సబ్‌స్టేషన్ నుంచి మహేంద్రవాడకు రూ.6.50 లక్షలతో చేపట్టిన ప్రత్యేక లైన్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. దీంతో శుక్రవారం మాజీ ఉప సర్పంచ్ తేతలి అబ్బాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే నల్లమిల్లి విద్యుత్ అనుసంధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు లోఓల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం సమస్యలకు పరిష్కారం లభించినట్టయింది. కార్యక్రమాల్లో ఏడీఈ నిరంజన్ బాబు, ఏఈ వీరభద్రరావు, నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తాడి గంగిరెడ్డి, ఎస్ఆర్‌కే ప్రసాదరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, సత్తి దేవదానరెడ్డి, నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్, జ్యోతిబాబు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

» రాజమహేంద్రవరంలో వంద రోజుల యాక్షన్ ప్లాన్
» నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 16 : రాజమహేంద్రవరంలో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌తో చాలా వరకు సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు సాగుతున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం కాన్ఫరెన్స్‌హాలులో శుక్రవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. నగరంలో ఉన్న సమస్యలను గుర్తించామని, ముఖ్యంగా కొన్నిప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని దాని పరిష్కారానికి ప్రతి ఇంటికి కుళాయి వేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నగరంలో గుర్తించిన ప్రాంతాలు అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి రోజు వచ్చే 165 మెట్రిక్ టన్నుల వ్యర్థాలతో ఎనర్జీని ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను బీపీసీఎల్ సహకారంతో ఏర్పాటు చేస్తామన్నారు. దోమల నియంత్రణకు డ్రోన్ల ద్వారా స్ప్రేయింగ్ విధానం ప్రయోగాత్మకంగా చేస్తున్నామని చెప్పారు. రోడ్డు వెడల్పునకు 30 ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో స్ట్రీట్ వెండర్స్‌కు ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ ప్రాంతాలను చూపిస్తామన్నారు. నగరంలో అభివృద్ధి పనులకు సంబంధించి 15వ ఆర్థికసంఘం నిధులు, సాధారణ నిధులు కేటాయిస్తామన్నారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమన్నారు. కార్పొరేషన్‌లోని విభాగాల్లో ఎటువంటి అవినీతి అక్రమాలు జరిగినా వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరాలు-2027కు సంబంధించి ట్రాఫిక్‌కు సబ్ కమిటీని వేయాలని ఇటీవల కలెక్టర్ ప్రశాంతి నేతృత్వంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరిలతో సమావేశం జరిగిందని త్వరలో కమిటీలు వేసి ముందస్తు ప్రణాళికతో పుష్కరాలకు వెళ్తామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. అంతకు ముందే నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి సుందరంగా తయారు చేస్తామన్నారు.

బిక్కవోలు ఎంపీడీవోగా ఝాన్సీ

బిక్కవోలు, ఆగస్టు 16: బిక్కవోలు ఎంపీడీవోగా జేఏ. ఝాన్సీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఎంపీడీవోగా పనిచేసిన వి.విజయలక్ష్మి విశాఖ జిల్లాకు బదిలీ అయ్యారు. ఝాన్సీకి ఏవో రత్నకుమార్, సీనియర్ అసిస్టెంట్ మంగరాజు, జూనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరెడి, టైపిస్టు పప్పు శ్రీను స్వాగతం పలికారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసన

ధవళేశ్వరం, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ధవళేశ్వరం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బ్యారేజ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు జాతీయ జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై అమానుషంగా జరుగుతున్న దాడులను ఆపే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. విద్వేషపూరితంగా జరుగుతున్న దాడులను నిరసించారు. కార్యక్రమంలో ఒంటెద్దు స్వామి, వేగిశెట్టి కోదండరామారావు, రాధారమణ, జి.కొండలరావు, కాశీకృష్ణ ప్రసాద్, ముత్యాల పూనికుమార్, తలాటం సూర్యప్రకాశరావు, జి.సూరిబాబు, పందెళ్ల భానుప్రసాద్, పీఎస్ శేషుకుమార్ పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

దివాన్‌చెరువు, ఆగస్టు 16: ప్రజా సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. రాజానగరం మండలం హౌసింగ్‌బోర్డు కాలనీలో శుక్రవారం ఆయన పర్యటించారు. కాలనీలోని తాగునీరు, పారిశుధ్యం సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకుని సంబంధిత సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. అలాగే సమస్యలను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కోరుకొండ ఎంపీడీవోగా నరేష్‌కుమార్

కోరుకొండ, ఆస్టు 16: కోరుకొండ ఎంపీడీవోగా పీఎస్ నరేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో కోరుకొండ ఎంపీడీవోగా పని చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నల్లజర్ల వెళ్లారు. ఆపై తిరిగి కోరుకొండకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ ఉద్యోగులు, ఎంఈవో టి.కుశలవదొర, సుజాత, సీఆర్పీలు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు

యాంటీ ర్యాగింగ్ సదస్సులో ఎస్ఈబీ సీఐ నిక్సన్

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 16: ర్యాగింగ్‌కు పాల్పడి విద్యార్థులు విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నిక్సన్ అన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.కళాశాల డీన్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం నేరమన్నారు. ఈ సదస్సులో కళాశాల ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగ సిలిండర్ల విషయంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి(విజిలెన్స్ ఎస్పీ) కేవీఎస్‌వీ సబ్బారెడ్డి హెచ్చరించారు. శాటిలైట్ సిటీ మెయిన్ రోడ్‌లోని వినాయక ఫుడ్ ప్లాజాలో సోదాలు చేశామన్నారు. గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం గుర్తించి ఐదు సిలిండర్లను తమ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. హోటల్ యజమాని నబ్బా సోముపై కేసు నమోదు చేశామన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 16: ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమం, శ్రీ గౌరంగ రాధాకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీల త్రిదండి స్వామి భక్త వైభవ పూరీ గోస్వామి మహరాజ్,ఆచార్యదేవ శ్రీ త్రిదండి స్వామి బనమహరాజ్‌చేతుల మీదుగా రాధాకృష్ణుల ఊయల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి పర్యవేక్షించారు. ఎస్వీ సత్యనారాయణ,పివిఎస్‌కృష్ణారావు భక్తులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఉత్తమ సేవా పురస్కారాలు

రాజానగరం, ఆగస్టు 16: గైట్ ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించినట్టు ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజు శుక్రవారం తెలిపారు. 2022-23, 2023-24 ఏడాదికిగానూ కె.లక్ష్మీ లలిత్య, షేక్ మోమినా ఉత్తమ వలంటీర్ అవార్డులు ఆంధ్ర విశ్వకళా పరిషత్ కులపతి జి.శశిభూషణరావు నుంచి అందుకున్నారన్నారు.ఎంఎస్ఎస్ ఫనీషా, ఎస్‌జీ సాయికుమార్, జి.సాయిశశాంక్, పి.సుచిత్రకు కూడా అవార్డులు లభించి నట్టు చెప్పారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ ధనరాజు, ఎన్ఎస్ఎస్ పీవో షేక్ మీరా అభినందించారు.

నేడు ఫస్ట్ ఎయిడ్ సర్వీసులు బంద్

ధవళేశ్వరం, ఆగస్టు 16: కలకత్తా ప్రభుత్వాసుపత్రిలో వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఫస్ట్ ఎయిడ్ సర్వీసులు నిలిపివేసి నిరసన తెలియజేయనున్నట్టు కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ప్రకటించిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీటీటీ రాజు, జిల్లా అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ వైద్యురాలికి ఆసుపత్రిలోనే రక్షణ కరువడం దారుణమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకోరావాల్సిన అవసరం ఉందన్నారు.



జిల్లాకు ఇద్దరు అడిషనల్ ఎస్పీలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 49 మంది అడిషనల్ ఎస్పీలకు స్థానచలనం కలిగిస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.జిల్లా శాంతి భద్రతల విభాగం అడిషనల్ ఎస్పీగా ఏవీ సుబ్బరాజు, పరిపాలనా విభాగం అడిషనల్ ఎస్పీగా సీఐడీలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రాజశేఖర్ రావు నియమితులయ్యారు. సుబ్బరాజు చిత్తూరు జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తూ ఇక్కడికి వస్తున్నారు.ఇక్కడ పరిపాలనా విభాగం అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న ఎస్ఆర్ రాజశేఖర్ రాజు అన్నమయ్య జిల్లాలో అదే విభాగానికి వెళ్లారు.



కొవ్వూరు అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు

నిడదవోలులో ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరంలో ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు వాసు, బత్తుల

రోజుకు రూ.15

అన్న క్యాంటీన్లు పునః ప్రారంభం

కూటమి ప్రభుత్వం వచ్చింది.. పేదల ఆకలి తీర్చుతోంది. నిన్నటి వరకూ ఆకలి వేస్తే అన్నమో రామచంద్రా అంటూ అర్రులు చాచాల్సిందే..మరి నేడు ఆ బాధేం లేదు.. కేవలం రూ.15 పెడితే చాలు ఉదయం టిఫిన్..మధ్యాహ్నం, రాత్రి భోజనం.. ఎందుకంటే మళ్లీ అన్న క్యాంటీన్లు పునఃప్రారంభమయ్యాయి. రాజమహేంద్రవరంలో మూడు, కొవ్వూరు, నిడదవోలులో ఒక్కొక్కటి చొప్పున శుక్రవారం ఈ అన్న క్యాంటీన్లు ప్రారంభించారు.. పేదల కడుపు నింపడానికి మళ్లీ చంద్రన్న క్యాంటీన్లు వచ్చేశాయి..



- జిల్లాలో ఐదు ఏర్పాటు
- రాజమహేంద్రవరంలో మూడు
- కొవ్వూరు, నిడదవోలులో ఒక్కొక్కటి
- పట్టణాల్లోని రద్దీ ప్రదేశాల్లో ఆరంభం
- మూడు పూటలా ఆహారం కేవలం రూ.15
- ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

నిడదవోలు, ఆగస్టు 16 : రాష్ట్రంలో పేద ప్రజల ఆకలి తీర్చేందుకు పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతోనే రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందని రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు గణేష్‌చౌక్ సెంటర్‌లో శుక్రవారం అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించి వృద్ధులకు ఆహారాన్ని అందించారు. 2014-19 మధ్య అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించి రూ.ఐదుకే అల్పాహారం, రూ.ఐదుకే భోజనం అందించారన్నారు. గత ప్రభుత్వం దీనిని నిర్వీర్యం చేసి పేదల కడుపుకొట్టిందన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగానే నేడు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించడం జరిగిందన్నారు. అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మ పేరును ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపాదన మేరకు సీఎం చంద్రబాబు మధ్యాహ్న భోజన పథకానికి పెట్టడం జరిగిందన్నారు.అన్న క్యాంటీన్‌కు దాతలు తమ విరాళాలను అందించి తమ వంతు సహకారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ రామ్ భూపాల్‌రెడ్డి, జనసేన నాయకులు రంగా రమేష్, బీజేపీ నాయకులు బండి సత్యనారాయణ, నీలం రామారావు, బలిజేపల్లి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూడు పూటలా కడుపు నింపుతాం : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్, ఆగస్టు 16 : రోజుకు రూ.15లు పెడితే మూడు పూటలా కడుపు నింపుతారని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో మూడు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. తొలుత క్వారీ సెంటర్ వద్ద ప్రారంభించారు. తరువాత రాజమహేంద్రవరం జీజీహెచ్ (ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి), సుబ్రహ్మణ్య మైదానం వద్ద గల అన్న క్యాంటీన్లను ప్రారంభించారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూఅన్న క్యాంటీన్లు పేదలు వినియోగించుకోవాలన్నారు. రోజుకు రూ.15 పెడితే మూడు పూటలా కడుపు నిండుతుందన్నారు. ముందుగా టోకెన్లు ఇచ్చి దాని ప్రకారం ఆహారం అందిస్తారని చెప్పారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ అన్న క్యాంటీన్లు మూసివేసి పేదల కడుపుకొడితే చంద్రబాబు ఆకలిబాధలు తీర్చారన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ పేదవాడు ఆకలితో ఉండకూడదన్నదే కూటమి ధ్యేయమన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన భోజనాన్ని ప్రతిరోజు అందించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం అల్పాహారం వడ్డించారు. వాటిని పేదలతో కలిసి తిని వాటి నాణ్యతను పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, తెలుగుదేశం నాయకులు కాశి నవీన్‌కుమార్, రవి యాదవ్, కూటమి నాయకులు అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించి పేదలతో కలిసి ఆహారం తీసుకున్నారు.

రూ.5లకే కడుపు నిండుగా : ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 16 : రాష్ట్రంలో ప్రతి పేదవాడికి కూడు, గూడు, గుడ్డ అందించాలన్నదే టీడీపీ లక్ష్యమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అన్నా క్యాంటీన్‌కు వచ్చిన వారికి ఆహార పదార్థాలను ఎమ్మెల్యే, ఇతర నాయకులు వడ్డించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ సిద్ధాంతాలతో 2014-19 మధ్య చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేశారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చుచేసి విలాస మందిరాలు నిర్మించుకున్నాడన్నారు. ఐదేళ్ళ పాటు అన్నా క్యాంటీన్లను మూసివేసి పేద ప్రజల కడుపు కొట్టాడన్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో మరలా అన్నా క్యాంటీన్లు ప్రారంభించి రూ.5లకే భోజనం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే టి.వి.రామారావు, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, పాలెంపాటి చినబాబు, యనమదల సుబ్రహ్మణ్యం, బేతిన నారాయణ, కలగర సుబ్బారావు, పిల్లలమర్రి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో టిఫిన్ ప్లేట్లు అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

మా కోసమే చంద్రబాబు తెరిచారు..



పువ్వులు అమ్ముకునేందుకు రాజమహేంద్రవరం వచ్చి గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో భోజనం చేసే వాడిని.. అన్న క్యాంటీన్ మూసివేశాక టిఫిన్ చేసినా.. భోజనం చేసినా జేబు ఖాళీ అయ్యేది. మాలాంటి పేదలకోసమే చంద్రబాబు అన్న క్యాంటీన్లు తెరిచారు. ధన్యవాదాలు చంద్రబాబు గారు. - వెంకటకృష్ణ, శ్రీరాంపురం

పట్టెడన్నం పెడుతున్న చంద్రన్న..



గతంలో చంద్రబాబు దయ వల్ల రూ.5కే అన్నం తినేవాళ్లం.. కానీ ఎప్పుడైతే ప్రభుత్వం మారిందో అన్న క్యాంటీన్లు తెరుచుకోలేదు. అప్పటి నుంచి చాలా ఇబ్బందులు పడ్డాం.మళ్లీ అన్న క్యాంటీన్లు తెరుచుకునే రోజు కోసం ఎదురుచూశాం.. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది..మా ఆశ తీరింది.

- చిన్నబాబు, రాజమహేంద్రవరం

ఆకలి బాధలు తీరతాయి..



గత ఐదేళ్లలో చాలా ఇబ్బందులు పడ్డాం. పనులకు వెళ్లినప్పుడు మధ్యాహ్నం రూ.5 ఉంటే అన్న క్యాంటీన్‌లో భోజనం చేసేవాళ్లం. అయితే గత వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసివేశాక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇన్నేళ్లకు కష్టాలు తీరాయి. మళ్లీ రూ.5కే టిఫిన్, భోజనం పెట్టడం ఆనందం.

- కురుపల్లి నాగేశ్వరరావు, జాంపేట



భూపతి
మునిసిపల్ కార్యాలయం
కామిశెట్టి

నిడదవోలులో కుర్చీలాట!

- 2021లోనే మునిసిపల్ చైర్మన్‌పై ఒప్పందం
- పదవీకాలం పంచుకునేలా నిర్ణయం
- కుదరదంటున్న భూపతి.. తేల్చాలంటున్న కామిశెట్టి
- మాజీ ఎమ్మెల్యే జీఎస్ నాయుడు మాట వినని వైనం

నిడదవోలు, ఆగస్టు 16 : నిడదవోలు వైసీపీలో కుర్చీ కుమ్ములాట మునిసిపల్ కార్యాలయం వేదికగా రచ్చకెక్కింది. చైర్మన్ కుర్చీ నాదంటే.. నాదంటూ ఇద్దరు పోటీపడుతున్నారు. నిడదవోలు పురపాలక సంఘానికి 2021లో జరిగిన ఎన్నికల్లో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్ పదవికి పోటీ పడ్డారు. ఈ నేపథ్యంలో అప్పటి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఇరువురి మధ్య ఒక ఒప్పందం చేశారు.25వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భూపతి ఆదినారాయణ (ఆదిబాబు)కు రెండున్నరేళ్లు.. ఆ తరువాత రెండున్నరేళ్లు 21వ వార్డు నుంచి విజయం సాధించిన వైసీపీ కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ (సత్తిబాబు)కు అవకాశం ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. ఆ ఒప్పందం మేరకు ఇటీవల ఆ గడువు ముగిసింది. దీంతో కామిశెట్టి వెంకట సత్యనారాయణ ముందుగా చేసుకున్న ఒప్పందాన్ని గుర్తుచేశారు. అయితే దానికి భూపతి ఆదినారాయణ ససేమిరా అనడంతో వివాదం కాస్తా రచ్చకెక్కింది. ఎన్నికల కోడ్ తదితర కారణాలతో చైర్మన్ పదవి మార్పు మారుతూ వచ్చింది. ఇదిలా ఉండగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. వైకాపా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఓటమి పాలయ్యారు. ఇటీవల ఆగస్టు ఒకటో తేదీన చైర్మన్ భూపతి ఆదినారాయణ జన్మదిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హాజరయ్యారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం భూపతి ఆదినారాయణను చైర్మన్ పదవికి రాజీనామా చేయమని కోరారు.అయితే సార్వత్రిక ఎన్నికల్లో సర్దుబాటు చేసిన భారీమొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తే రాజీనామా చేస్తానంటూ చైర్మన్ భూపతి ఆదినారాయణ చెప్పినట్టు సమాచారం. మరో పక్క ఒప్పందం ప్రకారం చైర్మన్ కుర్చీ తనకు ఇవ్వాలంటూ కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడిపై ఒత్తిడి తెచ్చారు. కుర్చీ ఆటలో ఇద్దరు బాబుల మధ్య మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఇరుక్కుపోయి ఎటూ తేల్చు కోలేని పరిస్థితి నెలకొంది.నిడదవోలు పురపాలక సంఘ కార్యాలయ చైర్మన్ చాంబర్‌లో శుక్రవారం మధ్యాహ్నం మరోసారి విభేదాలు రచ్చకెక్కాయి. కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ మరికొంత మంది కౌన్సిలర్లతో కలసి భూపతి ఆదినారాయణ ఛాంబర్‌కు వచ్చి చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే చైర్మన్ భూపతి ఆదినారాయణ తనకు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ఇవ్వవలసిన మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తే రాజీనామా చేస్తానని లేదంటే చేసే ప్రసక్తే లేదంటూ లేచి వెళ్లిపోయారు. దీంతో వైసీపీలోనే ఒక కౌన్సిలర్‌కు మరో మహిళా కౌన్సిలర్ భర్తకు మధ్య వివాదం చోటు చేసుకుంది.నిడదవోలులో జనసేన నాయకుడు కందుల దుర్గేష్ మంత్రిగా ఉండడంతో చైర్మన్ పదవి చేజిక్కించుకునేందుకు జనసేన నాయకులు పావులు కదుపుతున్నారు. పట్టణంలో ఎక్కడచూసినా చైర్మన్ కుర్చీ కుమ్ములాటపైనే చర్చ జరుగుతుంది.



పాచిక పారలేదు!

- ఉమ్మడి జిల్లాలో ఖనిజ సీనరేజీ డబ్బులు ఎగ్గొట్టాలన్న సుధాకర్ ఇన్‌ఫ్రా ప్లాన్‌కు గండి
- బాకీ పడ్డ రూ.44 కోట్లు కట్టకుండా తప్పించుకోవాలన్న ప్రయత్నం బెడిసికొట్టిన వైనం
- కంపెనీ ఆటలు సాగనివ్వని ప్రభుత్వం : 15 రోజుల్లోగా జమ చేయాల్సిందేనని ఆదేశాలు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిచిపోయిన సీనరేజీ వసూళ్ల దందా
- గత జగన్ సర్కారు ఓ కంపెనీకి రూ.20 కోట్లు సీనరేజీ రద్దును సాకుగా చూపిన కంపెనీ
- ఆ రద్దు చేసిన సీనరేజీ వల్ల తనకు రాబడి తగ్గిపోయిందంటూ అడ్డగోలు వాదన
- తమ కంపెనీ కట్టాల్సిన బాకీలో ఆ డబ్బు మినహాయించాలంటూ తప్పించుకునే యత్నం
- ఈలోపు అనూహ్యంగా ప్రభుత్వం మారడంతో కంగుతిన్న సుధాకర్ ఇన్‌ఫ్రా

ప్రభుత్వానికి బాకీ పడ్డ ఖనిజ సీనరేజీ డబ్బులు ఎగ్గొట్టాలన్న సుధాకర్ ఇన్‌ఫ్రా కంపెనీ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. అడ్డగోలు వాదనలతో ప్రభుత్వ ఖజానాకు పంగనామాలు పెట్టాలనుకున్న ప్రణాళికలు పటాపంచలయ్యాయి. బాకీ డబ్బులు రూ.44 కోట్లు కట్టి తీరాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. అది కూడా 15రోజుల్లోగా ఖజానాకు జమచేయాలని హెచ్చరించింది. గత వైసీపీ ప్రభుత్వ అండతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ కంపెనీ యథేచ్ఛగా చెలరేగి పోయింది. ఎక్కడికక్కడ ముక్కుపిండి సీనరేజీ కోట్లలో వసూలుచేసింది. ప్రభుత్వానికి నెలకు రూ.9.70 కోట్లు కట్టి అంతకు పదింతలు రాబట్టేసింది. తీరా అనుహ్యంగా ప్రభుత్వం మారడంతో కంపెనీకి ఝలక్ తగిలింది. అడ్డగోలు సీనరేజీ దందా ఆగిపోయింది. ఈ సాకుతో సర్కారు బాకీ ఉన్న బకాయిలు కట్టకుండా తప్పించుకునే ప్రయత్నం చేసినా వారి పాచిక పారలేదు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గనులశాఖకు చిన్నతరహా ఖనిజాల ద్వారా ఏటా కోట్లలో ఆదాయం సమకూరుతోంది. గ్రావెల్, నల్లరాతి కొండలు, మట్టి, లేటరైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడం ద్వారా భారీగా ప్రభుత్వానికి రాబడి వస్తోంది. అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో ప్రత్తిపాడు, తుని, పెద్దాపురం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పి.గన్నవరం, రాజోలు, ముమ్మిడివరం తదితర నియోజకవర్గాల్లో క్వారీ, గ్రావెల్, మట్టి తవ్వకాల ద్వారా ఎక్కువ రాబడి వస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఈ రాబడి గనులశాఖకు బదులు మొట్టమొదటిసారిగా కోనసీమ జిల్లాకు చెందిన సుధాకర్ ఇన్‌ఫ్రా అనే ప్రైవేటు కంపెనీకి అడ్డగోలుగా కట్టబెట్టేసింది. సీనరేజీ వసూలు బాధ్యత నుంచి గనులశాఖను తప్పించి సదరు కంపెనీకి అప్పగించేసింది. గనుల శాఖను డమ్మీగా మార్చేసి, సీనరేజీ వసూలు బాధ్యతంతా సుధాకర్ ఇన్‌ఫ్రాకు ఇచ్చేసింది. అందులోభాగంగా 2023 ఏప్రిల్ నుంచి 2025 ఏప్రిల్ వరకు రెండేళ్లపాటు ఈ కంపెనీ ఉమ్మడి జిల్లాలో సీనరేజీ వసూలు చేసుకునేలా అధికారం కట్టబెట్టింది. ఈ రెండేళ్లకు కలిపి రూ.233 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తేచాలని, అది కూడా భారం అయితే ఇందులో నెలనెలా రూ.9.70కోట్లు చొప్పున 24 వాయిదాల్లో చెల్లించాలని వెసులుబాటు ఇచ్చింది. ఇలా కంపెనీకి పూర్తి సహకారం అందించి ప్రభుత్వ పెద్దలు తెరవెనుక భారీగా పిండేశారు. అటు ప్రభుత్వం అండదండలు ఉండడంతో సుధాకర్ ఇన్‌ఫ్రా ఉమ్మడి ఇటీవల ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఉమ్మడి జిల్లాను పిండేసింది. ఎక్కడికక్కడ కొండలు, గుట్టలు, గ్రావెల్, క్వారీలు ఉన్న ప్రతిచోటా సొంతంగా మనుషులను నియమించింది. సీసీ కెమెరాలు బిగించి సొంత రసీదులతో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసింది. ఎవరు ఏ చిన్న మట్టి,గ్రావెల్ తవ్వుకున్నా ముక్కుపిండి సీనరేజీ వసూలుచేసింది. ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో వందలాది క్వారీల నుంచి నల్లరాయి ఇతర జిల్లాలకు ఎగుమతవగా, ఆ లారీల నుంచి ఒక్క రూపాయి కూడా వదలకుండా నెలనెలా కోట్లలో రాబట్టింది. ఈ కంపెనీకి తెరవెనుక వైసీపీ పెద్దల సహకారం ఉండడంతో గనులశాఖ కళ్లు మూసేసుకుంది. సీనరేజీ వసూళ్లలో నిబంధనలు ఉల్లంఘించినా కన్నెత్తి చూడలేదు. దీంతో ప్రభుత్వానికి నెలకు కట్టాల్సిన రూ.9.70 కోట్ల కంటే పదింతల రెట్టింపు ఆదాయం పిండేసింది. ఇలా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కంపెనీకి కాసుల పంట పండింది. రెండేళ్లలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తంలో సింహభాగం తొలి ఆరు నెలల్లోనే లాగేసింది.

సీనరేజ చెల్లించడం ఆపేసి..

అయితే అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయన్న సమయంలో సదరు కంపెనీ ప్రభుత్వానికి సీనరేజీ డబ్బులు చెల్లించడం ఆపేసింది. ఇదేంటని గనులశాఖ అడిగితే జగన్ ప్రభుత్వం కాకినాడ జిల్లాలో ఓ కంపెనీకి భారీ లబ్ధి చేకూర్చిందని మెలిక పెట్టింది. వాస్తవానికి ఎవరికీ తెలియకుండా గుట్టుగా గత ప్రభుత్వం జిల్లాలో తీరప్రాంతంలో పనులు చేస్తోన్న ఓ ప్రముఖ కంపెనీకి సహకరించింది. రౌతులపూడి నుంచి ఈ కంపెనీ 12 లక్షల మెట్రిక్ టన్నుల నల్లరాయి తరలించగా, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.20 కోట్ల రాయల్టీని రద్దుచేసి మేలు చేకూర్చింది. ఇదంతా రహస్యంగా ఉంచింది. విషయం తెలుసుకున్న సుధాకర్ ఇన్‌ఫ్రా గనులశాఖపై ఒత్తిడి తెచ్చింది. ఆ కంపెనీకి రూ.20 కోట్ల రాయల్టీ రద్దు చేయడం వల్ల తమకు రావలసిన సీనరేజీ ఆదాయం పోయిందని అభ్యంతరం తెలిపింది. అందువల్ల తాము నెలనెలా చెల్లించాల్సి ఉన్న బకాయిలకు సర్దుబాటు చేయాలంటూ కొత్తపాట పాడింది. అయితే కంపెనీ వెనుక వైసీపీ నేతలు ఉండడంతో గనులశాఖ మొత్తబడింది. దీంతో తన ఆటలు సాగినట్లేనని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన తన బాకీ కట్టకుండా ఉండొచ్చని లెక్కలేసుకుంది. ఎన్నికలు జరిగినా తిరిగి వైసీపీ ప్రభుత్వం వస్తుందనే ధీమాతో సదరు కంపెనీ అలా తన బాకీలు కట్టకుండా ఉండిపోయింది. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కంపెనీ కంగుతింది. ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా సీనరేజీ వసూలు కాంట్రాక్టు రద్దయిపోయింది. అటు కట్టాల్సిన బాకీలు చెల్లించాలంటూ గనులశాఖ ఒత్తిడి తేవడం మొదలుపెట్టింది. కొత్త ప్రభుత్వంలో పైరవీలు చేసి బాకీలు కట్టకుండా చేయాలని సదరు కంపెనీ ప్రయత్నాలు చేసింది. కానీ ప్రభుత్వం నుంచి సదరు కంపెనీకి సహకారం దొరకలేదు. సరికదా మొత్తం సీనరేజీ బాకీలన్నీ కలిపి రూ.44కోట్లు కట్టితీరాలని ఇటీవల గట్టిగా హెచ్చరించింది. 15రోజులలోగా ఖజానాకు డబ్బులు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. ముందు బాకీ చెల్లిస్తే తర్వాత రాయల్టీ రద్దులో సుధాకర్ ఇన్‌ఫ్రాకు అసలు సీనరేజీ రావలసి ఉందా? లేదా? తేల్చుదామని పేర్కొంది. దీంతో సుధాకర్ ఇన్‌ఫ్రా గింజుకుంటోంది.



వైద్య విద్యార్థిని హత్యపై నిరసన ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 16 : కోల్‌కత్తాలో వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి పాశవికంగా హత్యచేసిన ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేసారు. టీడీపీ వైద్యవిభాగం నాయకులు డాక్టర్ యాళ్ళ ప్రదీప్ ,డాక్టర్ కొమ్మాశ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం అంబేడ్కర్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి నేరస్తులరే కఠినమైన శిక్షలు పడేలా చూడాల్సన్నారు. ఈ ర్యాలీలో డాక్టర్లు చలుమూరు తులసీ మోహనరావు, డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ దివ్య, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సంతోష్, ఇతర వైద్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





వరములీయవే..వరలక్ష్మీ..

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున భక్తులు హాజరై దర్శించుకున్నారు.. వరములీయవే వరలక్ష్మీ అంటూ కొలిచారు. రాజమహేంద్రవరం మహాలక్ష్మీ ఆలయం వద్ద అమ్మవారి దర్శనానికి జనం బారులు తీరారు. ఉండ్రాజవరం మండలం పాలంగిలో కనకదుర్గమ్మకు పెద్ద ఎత్తున నోట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నల్లజర్ల సీఐగా శ్రీనివాస్



నల్లజర్ల, ఆగస్టు 16: నల్లజర్ల సీఐగా ఎస్.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నిన్నటి వరకు సీఐగా పని చేసిన దుర్గాప్రసాద్ వీఆర్‌కు వెళ్లగా విజయవాడ ఏసీబీ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ బదిలీపై నల్లజర్ల వచ్చారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై, కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్న, ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలను తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఎక్కడైనా అన్యాయం, అక్రమాలు జరుగుతున్నా, గంజాయి, డ్రగ్స్ రవాణా చేస్తున్న వారి వివరాలు 94407 96614 నెంబరుకు తెలియజేయాలని, చెప్పిన వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ అన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే మద్దిపాటి



గోపాలపురం, ఆగస్టు 16: జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌ను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతల నిర్వహణ, గంజాయి, సారా విక్రయాలు జరగకుండా స్థానిక పోలీసులను ఆదేశించాలని, ఎక్కడా లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా తట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్టు మద్దిపాటి చెప్పారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

తాళ్ళపూడి, ఆగస్టు 16: భారత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా తాళ్లపూడిలోని విజేత ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రమోద్ విద్యార్థులకు వాజ్‌పేయి జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఏఈ డేవిడ్‌కు అభినందనలు



ఏఈని అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

పెరవలి, ఆగస్టు 16: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎలక్ట్రికల్ ఏఈ డేవిడ్ నిశ్చల్‌ను శుక్రవారం కార్యాలయ సిబ్బంది, లైన్‌మెన్‌లు స్థానిక ఏఈ కార్యాలయంలో అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, జూనియర్ ఇంజనీర్ రమేష్, ప్రదీప్‌కుమార్, శేషగిరి, మూర్తి పాల్గొన్నారు.

పురుగు మందుల పిచికారీపై అవగాహన

నల్లజర్ల, ఆగస్టు 16: పురుగు మందులు పిచ్చికారి చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సిజెంటా కంపెనీ ప్రతినిధి శ్యామ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చీపురుగూడెంలోని రైతు చెల్లు వీర వెంకట్రావు వ్యవసాయ క్షేత్రంలో రైతులకు పురుగు మందుల వాడకం, పిచికారీపై అవగాహన కల్పించారు. పిచికారీ సమయంలో మాస్క్, గ్లౌజులు ధరించాలని, తక్కువ మోతాదులో పురుగు మందులు ఉపయోగించాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం లభించే మార్గాలను రైతులు అన్వేషించాలన్నారు. కార్యక్రమంలో చెల్లు సుబ్రహ్మణ్యం, చెల్లు పెద్దరామన్న, కూసంపూడి వెంకటేశ్వరరావు, పాతూరి శ్రీను, కంపన గోపాలం, గుళ్లపూడి గణేశ్ పాల్గొన్నారు.

అనాథ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు, చెప్పులు పంపిణీ చేస్తున్న సత్యకిరణ్

నల్లజర్ల, ఆగస్టు 16: నల్లజర్లలోని అనాథ హాస్టల్(ఆనంద నిలయం)లో ఉంటున్న విద్యార్థులకు దుప్పట్లు, చెప్పలను కాపు సంఘం జేఏసీ మండల కన్వీనర్ ఉన్నమట్ల సత్యకిరణ్ అందించారు. కార్యక్రమంలో చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, వల్లూరి సత్తిపండు, కోరా కన్నయ్య, గుదే సుబ్బారావు, సవలం రామకృష్ణ, గంటా తరుణ్, అప్పసాని సత్య పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగాన్ని వేగవంతం చేయాలి

చాగల్లు, ఆగస్టు 16: రాష్ట్ర అభివృద్ధికి అన్ని రంగాలతో పాటు పారిశ్రామిక రంగం వేగవంతం చేయడం అవసరమని పారిశ్రామికవేత్త, సుంకవల్లి ఫౌండేషన్ ఛైర్మన్ సుంకవల్లి వెంకన్నచౌదరి అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కోసం పారిశ్రామిక విధానం ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఉండాలని దీనివల్ల వలసలను కూడా నివారించవచ్చునన్నారు. పరిశ్రమల అభివృద్ధితోనే రాబడి పెరిగి ప్రజల జీవనప్రమాణాలు పెరుగుతాయన్నారు. పారిశ్రామిక ప్రగతి కోసం ఒక ప్రభుత్వ విధానాలను మరో ప్రభుత్వం కొనసాగించడం అవసరమని వెంకన్నచౌదరి అన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



కొవ్వూరు, ఆగస్టు 16: గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహన్ని గుర్తించినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరులోని ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ రోడ్ ఎదురుగా ఉన్న గోదావరి రేవులో సుమారు 65నుంచి 70ఏళ్ల వయసున్న వ్యక్తి అపస్మారకస్థితిలో పడివున్నాడు. స్థానికులు గమనించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారన్నారు. మృతదేహన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచామన్నారు. ఆచూకీ తెలిసిన వారు కొవ్వూరు పోలీసులకు సమాచారం అందించాలని సీఐ చెప్పారు.

గుర్తుతెలియని వృద్ధురాలికి అస్వస్థత



కొవ్వూరు, ఆగస్టు 16: అస్వస్థతకు గురయిన వృద్ధురాలిని ఆసుపత్రికి తరలించినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. శుక్రవారం కొవ్వూరు మండలం దొమ్మేరు పాత హైవే రోడ్డులో పాత మార్కెట్ చెక్‌పోస్టు పక్కన చెరువు వద్ద గుర్తుతెలియని వృద్ధురాలు అపస్మారకస్థితిలో పడి ఉంది. అటువైపు వెళ్తున్న వాహనదారులు ఆమెను కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెను పోలీసులు ప్రశ్నించగా తన పేరు అమ్మాణి అని, కొడుకు పేరు సుబ్బారావుగా చెబుతోంది. అయితే కొద్దిసేపు తనది తణుకు అని, మరికొద్దిసేపు పట్టిసీమని చెబుతుందన్నారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

ఏఎస్ఐకి ఐపీఎం అందజేత



రాజమహేంద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ ఐగా పనిచేస్తున్న మాడా సత్యనారాయణకు ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)ని ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం అందజేశారు. గతేడాది స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సత్యనారాయణకు కేంద్ర ప్రభుత్వం ఐపీఎంని ప్రకటించింది. ఈ సందర్భంగా సత్యనారాయణను ఎస్పీ నరసింహ కిశోర్, అధికారులు, సిబ్బంది అభినందించారు. ఈ ఏడాది జిల్లా ఫైర్ ఆఫీసర్ చిన్నం మార్టిన్ లూథర్ కింగ్‌కు ఐపీఎం ప్రకటించింది. ఈ పతకాన్ని వచ్చే ఏడాది అందజేస్తారు.

నేడు జీఎస్ఎల్-స్వతంత్ర హాస్పిటల్స్ వార్షికోత్సవం

రాజానగరం, ఆగస్టు 16: ఈ నెల 17న జీఎస్ఎల్-స్వతంత్ర హాస్పిటల్స్ 38వ వార్షికోత్సవాన్ని రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు సినీ దర్శకుడు వి.సందీప్‌రెడ్డి వంగా ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఎస్పీ నరసింహకిషోర్ పాల్గొంటున్నట్టు చెప్పారు.

అడుగుకో అతుకు.. గజానికో గొయ్యి

» కానూరు-పెరవలి ఆర్‌అండ్‌బీ రోడ్డు దుస్థితి
» పది కిలోమీటర్లు మేర సుమారు వంద గోతులు
» ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు



తీపర్రు వద్ద రోడ్డుపై ఉన్న గోతులు



రాళ్లు లేచిపోయిన కానూరు -ఉసులుమర్రు రోడ్డు

పెరవలి, ఆగస్టు 16: కానూరు-పెరవలి ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిస్థితి అడుగుకో అతుకు.. గజానికో గొయ్యి అన్నట్టుగా ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు అధ్వానంగా మారింది. నాలుగేళ్ల క్రితం ఈ రోడ్డును వెడల్పు చేసి పటిష్ట పరిచారు. అయితే అప్పటి నుంచి ప్రతి నెలా రోడ్డుకు మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌కు గడువు దాటి పోవడంతో మరమ్మతులను పట్టించుకోవడం లేదు. దీంతో సుమారు పది కిలోమీటర్లు మేర సుమారు వంద వరకు గోతులు ఏర్పడ్డాయి. నిత్యం ఈ రోడ్డుపై వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. లారీలు, బస్సులు, కార్లు, ఆటోలతో పాటు మోటారుసైకిళ్లు కూడా వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతల్లో నీరు నిలబడి పోయి చెరువులా మారాయి. రాత్రి సమయాల్లో పలువురు ఈ గోతుల్లో పడి అనేక ప్రమాదాలు గురవుతున్నారు.

తీపర్రు వద్ద ఇదేవిధంగా పెద్ద గొయ్యి ఏర్పడడంతో వాహనదారులకు హెచ్చరికగా ఒక చెట్టుకొమ్మను గొయ్యి వద్ద ఏర్పాటు చేశారు. గతంలో ఈ రోడ్లను ఎప్పటికపుడు మరమ్మతులు చేసేవారని ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గి ఎండలు కాస్తున్నందున రోడ్డుపై ఏర్పడిన గోతులు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో కార్పొరేట్ వైద్య సేవలు

» పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
» నిడదవోలు సీహెచ్‌సీలో ఎక్స్‌రే యూనిట్ ప్రారంభం

నిడదవోలు, ఆగస్టు 16: ప్రభుత్వాసుపత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిడదవోలు సీహెచ్‌సీలో సుమారు రూ.3 లక్షల వ్యయంతో ఎక్స్‌రే యూనిట్ ఏర్పాటు చేశామని, దీనికి అనుసంధానంగా ఎక్స్‌రే టేబుల్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు. నిడదవోలు చుట్టు పక్కల గ్రామాల ప్రజల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయవలసిన ఆవశ్యకత ఉందని, దీనిపై ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శితోను, ఆరోగ్యశాఖ మంత్రితోను మాట్లాడినట్టు దుర్గేష్ చెప్పారు. అలాగే స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లను మంత్రి దుర్గేష్ అందజేశారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షేక్ ఫయాజ్, డాక్టర్ పి.వినీల్, రెహనా, మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, బీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎన్.శ్రీనివాస్, కేఎన్‌వీ గురుమూర్తి, బి.మేరీసుజాత, రంగా రమేష్, బండి సత్యనారాయణ, నీలం రామారావు పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్ రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

వరాలిచ్చే..వరలక్ష్మి

» భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం.. ముత్తయిదువులకు వాయనాలు
» భక్తులతో పోటెత్తిన అమ్మవారి ఆలయాలు



దేవరపల్లిలో వెంకన్న ఆలయంలో కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు

పెరవలి, ఆగస్టు 16: శ్రావణమాసంలో పౌర్ణమికి ముందువచ్చిన శుక్రవారం సందర్భంగా ఇంటింటా మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాన్ని జరుపుకున్నారు. వేకువఝామునే లేచి పుణ్యస్నానాలను ఆచరించి, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండి వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. మండలంలోని కానూరు కొండాలమ్మ దేవాలయం, తీపర్రు చింతాలమ్మ, కాకరపర్రు, ఖండవల్లిలో కనకదుర్గమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఇళ్ల వద్ద కూడా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలోని బాలదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయార్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిడదవోలు: మండలంలోని తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ దేవస్థానంలో విశేష పూజలు జరిపారు. ఉదయం నుంచి అభిషేకాలు, కుంకుమ పూ జలు నిర్వహించారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగిలో కనకదుర్గమ్మను కరెన్సీనోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం అమ్మవారి పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పువ్వులతో విశేషంగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలకు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. కనకదుర్గమ్మ ఆలయంలోను భక్తులు విశేషంగా పూజలు జరిపారు.



నిడదవోలు: ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ తల్లి

చారు. గ్రామంలో సంగడి వీరమణి ఇంటి వద్ద జరిగిన సామూహిక వరలక్ష్మివ్రతంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక శ్రీధనలక్ష్మమ్మ ఆలయంలో కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ చేశారు. సాయంత్రం శ్రీలక్ష్మీ నారాయణ పాంచ్రిక హోమం నిర్వహించారు.



చాగల్లు: పూలతో విశేష అలంకరణలో ధనలక్ష్మమ్మ

పటిష్టంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో మార్గదర్శకాలను అనుసరించి కమిటీ సమావేశం కాలేదన్నారు. జిల్లాలోని కేసుల వారీగా సమగ్ర వివరాలను అందజేయాలని ఆదేశించామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నివారణ కమిషన్ రాష్ట్రంలో పర్యటించిన దృష్ట్యా జిల్లాలోని ప్రజాప్రతినిధులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు. కేసులను పరిష్కరించే విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు, పరిహారం, కేసు స్థాయి తదితర అంశాలపై అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి రోస్టర్ పాయింట్లు వారీగా పోస్టుల భర్తీపై ఆయా శాఖలు నివేదిక అందజేయాలన్నారు. పౌర హక్కుల అమలు తీరును క్షేత్ర స్థాయిలో గమనించడానికి ప్రతి శనివారం పర్యటన చేయాలన్నారు. ఎఫ్ఐఆర్ దశలో 1509, కన్విక్షన్ స్టేజిలో ఒకటి, చార్జిషీటు దశలో 67 కేసులు ఉన్నాయన్నారు. మహిళల భద్రత, పీవోపీ చట్టం అమలుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ డి.నరసింహ కిశోర్ పేర్కొన్నారు.ఈ మేరకు తమ సిబ్బందికి దిశా నిర్దేశం చేశామ న్నారు. ఇప్పటికే కేసుల వారీగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, కమిటీ సభ్యులు ఐ.సత్యనారాయణ, ఎ.చిన్నరాజు, టి.బాలు, కౌన్సిలర్లు బి.జార్జి ఆంటోనీ, డి.రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

25న జాంపేట అర్బన్ బ్యాంక్ ఎన్నిక

12 డైరెక్టర్ పదవులకు 37 నామినేషన్లు దాఖలు



డైరెక్టర్ పదవులకు నామినేషన్లు దాఖలు చేస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : జాంపేట కోపరేటివ్ అర్బన్ పాలక వర్గ ఎన్నికలకు శుక్రవారం మొత్తం 37 మంది నామినేషన్లు దాఖలు చేసినట్టు రాజమహేంద్రవరం డివిజనల్ కోపరేటివ్ అధికారి, ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఛైర్మన్ అభ్యర్థి బొమ్మన జయకుమార్‌తో పాటు ప్రస్తుత పాలకవర్గ డైరెక్టర్ ప్రసాదుల హరనాథ్ తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు. బ్యాంక్‌కు సంబంధించిన మొదటి నియోజకవర్గంలో 10 డైరెక్టర్ పదవులకు 30 మంది నామినేషన్లు దాఖలు చేయగా, 2వ నియోజకవర్గంలో ఒక పదవి కోసం ఇద్దరు, మూడో నియోజకవర్గంలో ఒక పదవి కోసం ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం స్క్రూట్నీ ఉంది. ఆదివారం నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. జాంపేట ప్రధాన బ్యాంక్ పరిధిలోని 10మంది కంటే ఎక్కువ మంది నిలబడితే ఎన్నిక తప్పదు.మిగతా చోట్ల ఒకరికన్నా ఎక్కువ మంది ఉన్నా పోలింగ్ తప్పదు. 25న పోలింగ్ నిర్వహిస్తారు. ఛైర్మన్ అభ్యర్థి బొమ్మన జయకుమార్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు హాజరయ్యారు. బ్యాంక్‌లో సుమారు 32 వేలకు పైగా ఓటర్లు ఉండగా 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారన్నారు. ప్రధాన బ్రాంచి జాంపేట, మోరంపూడి ధవళేశ్వరం, సీతంపేట, అనపర్తి, గోకవరం, పెద్దాపురం, కాకినాడ, ఏలూరు, కొవ్వూరుల్లో మొత్తం 10 బ్రాంచిలు ఉన్నాయన్నారు. ఈ బ్యాంక్ పరిధిలోని బ్రాంచిలను మూడు నియోజకవర్గాలుగా విభజించారు. మొదటి నియోజకవర్గంలో జాంపేట మెయిన్ బ్రాంచి ఒకటి.ఇక్కడ 15,623 మంది ఓటర్లున్నారు. మోరంపూడి బ్రాంచిలో 2142 మంది ఓటర్లు, ధవళేశ్వరం బ్రాంచిలో 3221 మంది ఓటర్లు, సీతంపేట బ్రాంచిలో 2766 మంది ఓటర్లు కలిపి మొత్తం 23,752మంది ఉన్నారు. వీరు మొత్తం 10మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఇక నియోజకవర్గం 2 పరిధిలో మొత్తం 1901మంది ఓటర్లున్నారు. వీరు ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. ఈ నియోజకవర్గం పరిధిలో రెండు బ్రాంచిలు ఉన్నాయి. అనపర్తిలో 963 మంది ఓటర్లు ఉన్నారు. గోకవరం బ్రాంచిలో 938 మంది ఉన్నారు. మూడో నియోజకవర్గంలో నాలుగు బ్రాంచిలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 2071 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. పెద్దాపురం బ్రాంచిలో 963 మంది, కాకినాడ బ్రాంచిలో 834 మంది,ఏలూరు బ్రాంచిలో 480మంది, కొవ్వూరు బ్రాంచిలో ఏడుగురు ఓటర్లు ఉన్నారు.

వికసిత ఆంధ్రప్రదేశ్ 2047 దిశగా కార్యాచరణ

» జిల్లాలో 9 విభాగాల ఆధ్వర్యంలో కమిటీలు
» చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అప్పలకొండ



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలకొండ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 16: వికసిత ఆంధ్రప్రదేశ్-2047 దిశగా కార్యాచరణ రూపొందించాలని చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (సీపీవో) ఎల్.అప్పలకొండ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన వికసి త ఏపీ-2047లో భాగంగా 2024-29 కార్యాచరణ ప్రణాళిక దృష్టి కోణంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ 12 అంశాల ప్రాతిపదికన అభివృద్ధి సామర్థ్యం ప్రణాళికలను సిద్ధం చేసుకుని అమలు దిశగా కార్యాచరణ రూపొందించాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన వర్క్ షాప్‌లో ఆ మేరకు రాష్ట్రంలో అమలు చేయాలని వాటిపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. అలాగే జిల్లా స్థాయిలో కూడా ఆయా శాఖలు నివేదిక అందజేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవా రంగం వారీగా 9 విభాగాల ఆధ్వర్యంలో జిల్లాలో కమిటీలు వేసినట్టు సీపీవో చెప్పారు. పరిశ్రమల శాఖ జిల్లా ప్రోత్సాహక అధికారి టీవీ సూర్యప్రకాష్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రణాళిక రూపొందించడం దృష్టి కోణం తయారీపై అనుబంధ శాఖల అధికారులు సంబంధిత మునిసిపాలిటీ, మం డల స్థాయిలో ఫీల్డ్‌తో ఈనెల 26 నుంచి 31వ తేదీ మధ్య నిర్వహించాల్సి ఉం దన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహించడమే కాకుండా ఈ విషయాన్ని సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా దృక్పథ ప్రణాళికను రూపొందించడానికి పర్యవేక్షణ చేయాలన్నారు. ఏపీఎంఐపీ అధికారి ఎ.దుర్గేష్ మాట్లాడుతూ విజన్ ప్లాన్‌పై జిల్లాలో 6నుంచి 10వ తరగతి విద్యార్థులకు వచ్చేనెల 10నుంచి 14వరకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తారని తెలిపారు. జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికసిత ఆంధ్ర విజన్‌ని ప్రాచుర్యంలోకి తీసుకురావాలని మాస్టర్ ట్రైనర్ తెలిపారు. వచ్చేనెల 1నుంచి 15 వరకు ప్రజలకు మండల, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు.సమావేశంలో కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీకలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, జిల్లా పరిశ్రమల అధికారి పీకే పి.ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, వ్యవసా యాధి కారి ఎస్.మాధవరావు, ఎల్‌డీ ఎండీవీ ప్రసాద్, డీఎల్‌డీవో వి.శాంతామణి, డ్వామా పీడీ ఎ.ముఖలింగం, హార్టికల్చర్ అధికారి బి.సుజాత పాల్గొన్నారు.

'వయ్యారిభామ'తో అనర్థాలెన్నో!

» కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ నాయుడు
» కలుపు మొక్క పార్థీనియంపై అవగాహన వారోత్సవాలు



కేవీకేలో అవగాహన వారోత్సవాలు ప్రారంభిస్తున్న నాయుడు

రాజానగరం, ఆగస్టు 16: వయ్యారి భామ కలుపు మొక్కలు పంటతో పాటు పశువులకు ఎనలేని అనర్థాలు తెచ్చిపెడుతుందని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు పేర్కొన్నారు. సీటీఆర్ఐ, కలవచర్ల కేవీకేలో వయ్యారి భామ(పార్థీనియం)కలుపు మొక్కపై శుక్రవారం అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా వయ్యారి భామగా పిలిచే ఈ మొక్కను కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్ర కలుపు అనే పేర్లతో పిలుస్తారన్నారు. ఇది అత్యంత ప్రమాదకర మైన కలుపు మొక్కని, ఇది స్రవించే కొన్ని రకాల రసాయనాల వల్ల సహచర మొక్కల పెరుగుదల నశించిపోతుందని, మనుషులకు ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు వస్తాయని చెప్పారు. ఈ మొక్క ఆకులు చర్మానికి తాకితే దద్దుర్లు ఏర్పడతాయని, దీని గాలిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబ డడం, కనురెప్పల వాపు వస్తాయని, పొలాల్లో పనిచేసే వారికి చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు సక్రమిస్తాయని చెప్పారు. సాధారణంగా ఈ మొక్కను పశువులు తినవని, పొరపాటున తింటే వాటి జీర్ణక్రియ, మూత్రపిండాలు, కాలేయం, అన్నవాహిక, శ్వాసక్రియ దెబ్బతింటాయని వివరించారు. పాలిచ్చే పశువులు తింటే పాల నాణ్యత తగ్గి దుర్వాసన కలిగి రుచి లేకుండా చేదుగా ఉంటాయన్నారు. వయ్యారిభామ మొక్కలను పూత దశకు రాకముందే వేళ్లతో సహా పీకి తగల బెట్టాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో 10 లీటర్ల నీటికి 5 కిలోల ఉప్పు కలిపి ద్రావణాన్ని పిచికారీ చేస్తే ఈ మొక్కలు మొలకెత్తవని చెప్పారు. లేదా 2,4డి లేదా పారక్వాట్ అనే కలుపు మందులు పిచికారీ ద్వారా వయ్యారిభామ అంతరించిపోతుందన్నారు. సామూహిక భాగస్వామ్యంతో దీన్ని వ్యాప్తిని అరికట్టాలని నాయుడు అన్నారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది జేవీఆర్ సత్య వాణి, రఘునందన్, నాగేశ్వర్‌రెడ్డి, రవీందర్, సంజయ్ హెగ్డే, విజయవర్ధన్, ప్రభాత్, విజయవాడ మేరీ స్టెల్లా కళాశాలకు చెందిన వ్యవసాయ విద్యార్థినులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసన

ధవళేశ్వరం, ఆగస్టు 16: బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ధవళేశ్వరం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బ్యారేజ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు జాతీయ జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై అమానుషంగా జరుగుతున్న దాడులను ఆపే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. విద్వేష పూరితంగా జరుగుతున్న దాడులను నిరసించారు. కార్యక్రమంలో ఒంటెద్దు స్వామి, వేగిశెట్టి కోదండరామారావు, రాధారమణ, జి.కొండలరావు, కాశీకృష్ణ ప్రసాద్, ముత్యాల పూసికుమార్, తలాటం సూర్యప్రకాశరావు, జి.సూరిబాబు, పందెళ్ల భానుప్రసాద్, పీఎస్ శేషకుమార్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	మురారి
వై.స్క్రీన్2	తుఫాన్
దేవిశ్రీ(గాయత్రి	బడ్డీ
అనన్య	కమిటీ కుర్రోళ్లు

నిడదవోలు

వీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
రాధాకృష్ణ	ఆయ్, తంగలన్
శ్రీగణపతి	డబుల్ ఇస్మార్ట్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	కమిటీ కుర్రోళ్లు
శ్రీరామ్ సినీ మ్యాక్స్	కమిటీ కుర్రోళ్లు

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	---
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---